# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website2:www.netinijam.com2 ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 E-mail : netinijam93@gmail.com

హైదరాబాద్ బుధవారం 22-5-2024 NETI NIZAM Telugu Daily, RNI No.52865/93· Postal No. HQ/SD/258/2024-2026 సంపుటి :30 సంచిక:224 పేజీలు:6 వెల: రూ.1/-


## పారిశ్రామిక అభివృద్ధిలో ప్రపంచంతో పోటీ పడాలి

**-పారిశ్రామిక అభివృద్ధికి సంబంధించి కొత్తగా ఆరు పాలసీలు**

**-అధికారులతో సమీక్షలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి**

హైదరాబాద్ మే 21 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );పారిశ్రామిక అభివృద్ధిలో తెలంగాణ ప్రపంచ దేశాలతో పోటీపడేలా విధానాలు ఉండాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులకు సూచించారు. తెలంగాణ స్టేట్ ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ కు సంబంధించి మంగళవారం అధికారులతో సీఎం సమీక్ష సమావేశం నిర్వహించారు. రాష్ట్రంలో పారిశ్రామిక అభివృద్ధికి తీసుకోవాల్సిన నూతన విధానాలపై పలు సూచనలు చేశారు. గత సమీక్షా సమావేశాల్లో తీసుకున్న నిర్ణయాలు, పనుల్లో పురోగతికి సంబంధించిన వివరాలను అధికారులు సీఎం కు వివరించారు. టెక్స్ టైల్స్ కు సంబంధించి రాష్ట్రంలోని పవర్ లూమ్, హ్యాండ్ లూమ్ కార్మికులకు ఉపయోగపడేలా కొత్త పాలసీని రూపొందించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులకు సూచించారు. పారిశ్రామిక అభివృద్ధికి సంబంధించి కొత్తగా ఆరు పాలసీలను రూపొందించనున్నట్లు అధికారులు ముఖ్యమంత్రికి తెలిపారు. ఎంఎస్ఎంఈ పాలసీ, ఎక్స్ పోర్ట్ పాలసీ, న్యూ లైఫ్ సైన్సెస్ పాలసీ, రివైజ్డ్ ఈవీ పాలసీ, మెడికల్ టూరిజం పాలసీ, గ్రీన్ ఎనర్జీ పాలసీలను రూపొందిస్తున్నామని సీఎంకు వివరించారు.

### చురక

ఇంటర్నెట్ గుండాల
ఇజ్జత్ లేని ట్రోలింగులు
సామాజిక మాధ్యమాల్లో
జ్వలిస్తున్న స్త్రోలింగులు
ఆడ మగ కులం మతం
అంతట ఈ వేధింపులె
అదుపులేక బ్లాక్ మేల్
అనైతికపు సాధింపులె



-వేల్పుల నారాయణ

## వర్షాకాలంలో శానిటేషన్‌పై అప్రమత్తంగా ఉండాలి

**-వేసవిలో తాగునీటి సరఫరా సక్సెస్‌పై మంత్రి అభినందన**

**- రానున్నరోజుల్లో ఇలాగే పని చేయాలి**

**-అధికారులకు పంచాయతీరాజ్ శాఖా మంత్రి సీతక్క ఆదేశం**



హైదరాబాద్ మే 21 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);: వేసవిలో ఇబ్బందులు లేకుండా అన్ని గ్రామాలకు, ఆవాసలకు తాగునీటి సరఫరా చేయడం పట్ల పంచాయతీరాజ్, మిషన్ భగీరథ మంత్రి సీతక్క హర్షం వ్యక్తం చేశారు. సెక్రటేరియట్ లో పీఆర్, ఆర్డి, మిషన్ భగీరథ అధికారులతో మంత్రి సీతక్క సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా త్రాగునీటి సరఫరా అధికారుల పని తీరు అభినందనీయమని మంత్రి అన్నారు. రానున్న రోజుల్లో కూడా ఇదే పనితీరు ప్రదర్శిస్తూ ప్రజలకు ఇబ్బంది పడకుండా పనిచేయాలని అధికారులను ఆదేశించారు. వర్షాకాలంలో త్రాగునీరు కాలుష్యం కాకుండా, డ్రైనేజీ పైపులు లీకేజీ లేకుండా జాగ్రత్త వహించాలని అధికారులకు మంత్రి ఆదేశించారు. వర్షాకాలంలో గ్రామపంచాయతీల్లో శానిటేషన్ పై జాగ్రత్తగా ఉండాలని, డ్రైనేజీలు, రోడ్లపై నీళ్లు నిలవకుండా చర్యలు చేపట్టాలని మంత్రి ఆదేశించారు. ఈ సమావేశంలో పంచాయతీ రాజ్ ప్రిన్సిపల్ సెక్రటరీ సందీప్ కుమార్ సుల్తానియా, ఈఎన్సిలు కృపాకర్ రెడ్డి, కనకరత్నం, కమిషనర్ అనిత రామచంద్రన్, విద్యాసాగర్, కాత్యాయని ఇతర అధికారులు పాల్గొన్నారు.

## ఏ మాత్రం గౌరవం ఉన్నా 48 గంటల్లో సిట్ ముందు లొంగిపో..

**- ప్రజ్వల్‌కు మాజీ ముఖ్యమంత్రి హెచ్‌డీ కుమారస్వామి కీలక విజ్ఞప్తి**

బెంగళూర్ మే 21 (ఎక్స్ ప్రెస్ న్యూ స్)ల;కర్ణాటక సెక్స్ స్కాండల్ కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న మాజీ ప్రధాని దేవె గౌడ మనవడు ప్రజ్వల్ రేవణ్ణ కు మాజీ ముఖ్యమంత్రి హెచ్‌డీ కుమారస్వామి కీలక విజ్ఞప్తి చేశారు. తనపై, హెడీ దేవెగౌడపై ఏమాత్రం గౌరవం ఉన్నా 48 గంటల్లో స్వదేశానికి తిరిగి వచ్చి సిట్ ఎదుట లొంగిపోవాలని కోరారు.ఏప్రిల్ 26న జరిగిన కర్ణాటక లోక్‌సభ ఎన్నికల తొలి దశకు ముందు ప్రజ్వల్‌పై లైంగిక వేధింపులకు పాల్పడినట్లు ఆరోపణలు వచ్చిన విషయం తెలిసిందే. ఆ తర్వాత అతను విదేశాలకు వెళ్లిపోయారు. దీంతో పోలీసులు ప్రజ్వల్‌పై అరెస్ట్ వారెంట్ కూడా జారీ చేశారు. అయితే, ఇప్పటి వరకూ అతడు భారత్‌కు తిరిగిరాలేదు. ఈ నేపథ్యంలో కుమారస్వామి.. ప్రజ్వల్‌ను అభ్యర్థించారు. అశ్లీల వీడియోల కేసు తమ కుటుంబం మొత్తాన్ని తల దించుకునేలా చేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఘటనకు తాను బేషరతుగా ప్రజలకు క్షమాపణలు కోరుతున్నట్లు చెప్పారు. వెంటనే భారత్‌కు తిరిగొచ్చి పోలీసుల విచారణకు సహకరించాలని కోరారు.'ఎక్కడున్నా భారత్‌కు తిరిగొచ్చి విచారణకు హాజరవ్వు. తప్పించుకోవద్దని నేను అభ్యర్థిస్తున్నాను. ఏ తప్పూ చేయకపోతే.. ఎందుకు భయపడుతున్నావ్? ఎన్ని రోజులు దొంగా పోలీసు ఆట ఆడుతావు..? విదేశం నుంచి వచ్చి విచారణకు సహకరించు' అని విజ్ఞప్తి చేశారు. రాజ్యసభ స్థానానికి రాజీనామా చేస్తానని దేవేగౌడ ప్రకటించగా, తామంతా అడ్డుకున్నామని ఈ సందర్భంగా కుమారస్వామి చెప్పారు. ఎన్నికల ప్రక్రియ పూర్తయిన తర్వాత ప్రజ్వల్ ఎవరికీ చెప్పకుండా విదేశాలకు వెళ్లాడని.. ఒక వారంలో వచ్చి విచారణకు హాజరవుతానని ప్రకటించిన అనంతరం అతనిపై అత్యాచారం కేసు నమోదు చేయడంతో భారత్‌కు వచ్చేందుకు వెనకడుగు వేసి ఉండొచ్చని కుమారస్వామి పేర్కొన్నారు.

## 2 లక్షల ఉద్యోగాల మాటే లేదు.. నిరుద్యోగ భృతి ఊసే లేదు : కేటీఆర్



నల్గొండ, 21 :నిరుద్యోగుల పాలిట శాపంగా మారిన కాంగ్రెస్ పార్టీపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నిప్పులు చెరిగారు. 2 లక్షల ఉద్యోగాల మాటే లేదు.. నిరుద్యోగ భృతి ఊసే లేదు అని కేటీఆర్ మండిపడ్డారు. నల్లగొండ జిల్లా కేంద్రంలో నిర్వహించిన ఖమ్మం - వరంగల్ - నల్లగొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచార సభలో బీఆర్ఎస్ అభ్యర్థి రాకేశ్ రెడ్డికి మద్దతుగా కేటీఆర్ పాల్గొని ప్రసంగించారు.

ఖమ్మం - నల్లగొండ - వరంగల్ పట్టభద్రుల నియోజకవర్గం పరిధిలో 4 లక్షల 70 వేల మంది పట్టభద్రులు ఉన్నారు. మరి అరచేతిలో వైకుంఠం చూపెట్టి మోసం చేసిన కాంగ్రెస్ పార్టీకి ఓటేద్దామా.. పదేండ్ల పాటు నిజాయితీగా పని చేసిన బీఆర్ఎస్‌కు ఓటెద్దామా.. ఒక గోల్డ్ మెడల్ సాధించి ప్రజాసేవకు అంకితమైన రాకేశ్ రెడ్డికి ఓటేద్దామా.. మీడియా, యూట్యూబ్ అడ్డం పెట్టుకుని దందాలు చేసే చీటర్లకు ఓటేద్దామా.. అనేది ఆలోచించాలని పట్టభద్రులకు కేటీఆర్ సూచించారు.

మెగా డీఎస్సీ ముచ్చటనే లేదు..

ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం.. జాబ్ క్యాలెండర్ లేదు. మెగా డీఎస్సీ ముచ్చటనే లేదు. ఇప్పటికే 30 వేల ఉద్యోగాలు ఇచ్చానని రేవంత్ అంటున్నాడు. కానీ రేవంత్ రెడ్డి వచ్చాక ఒక్క నోటిఫికేషన్ కూడా రాలేదు. ఉద్యోగాలు ఇచ్చామని డైలాగులు కొడితే నమ్మేందుకు మనం పిచ్చోళ్లామా.. కాంగ్రెస్ చెప్పిన 2 లక్షల ఉద్యోగాల మాటే లేదు. మీ తరపున కొట్లాడాలి అంటే మాకు బలమివ్వాలి. కానీ బాకాలు ఊదేవాళ్లకు కాదు అని కేటీఆర్ చెప్పారు.

ఐదు నెలల్లోనే ఐదేండ్ల అపఖ్యాతిని మూటగట్టుకుంది..

ఈ ప్రభుత్వం ఐదు నెలల్లో అన్ని వర్గాలను మోసం చేసింది. ఐదు నెలల్లోనే ఐదేండ్ల అపఖ్యాతిని మూటగ్గటుకుంది కాంగ్రెస్ ప్రభుత్వం. బ్రహ్మాండంగా ఉన్న పరిస్థితిని చెడగొట్టుకున్నామని ప్రజలు అనుకుంటున్నారు. ఇప్పుడైనా ఆలోచించి ఓటేయండి.. ఆగం కాకండి. ఎవరి వల్ల లాభం జరుగుతదో ఆలోచించాలి. బ్లాక్ మెయిలర్లు, దందాలు చేసేటోళ్లకు అవకాశం ఇస్తే సమాజానికి తీవ్ర నష్టం. సన్న వడ్లకు మాత్రమే బోనస్ ఇస్తామని సన్నాయి నొక్కులు నొక్కుతున్న సన్నాసి కాంగ్రెస్ ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలంటే గ్రాడ్యుయేట్లు సరైన తీర్పునివ్వాలి. ఈ ఎన్నికల్లో రాకేశ్ రెడ్డికి ఆశీర్వాదం ఇస్తే ప్రభుత్వం నిలదీసే అవకాశం ఉంటుంది అని కేటీఆర్ అన్నారు.

## ఇది ప్రజా పాలన కాదు..రైతు వ్యతిరేక పాలన..

**- ఓట్ల నాడు ఒక మాట.. నాట్ల నాడు మరో మాట**

**-బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ మండిపడ్డారు**

హైదరాబాద్ మే 21 (ఎక్స్ ప్రెస్ న్యూ స్): ఇది ప్రజా పాలన కాదు అని, రైతు వ్యతిరేక పాలన అని, నిన్నటిదాకా సాగునీరు ఇవ్వక సావగొట్టారని, ఇప్పుడు కరెంట్ కోతలతో పంటలను ఎండగొట్టారని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ మండిపడ్డారు. కెటిఆర్ తన ట్విట్టర్ లో ట్వీట్ చేశారు. అసెంబ్లీ ఎన్నికల ముందు వరిపంటకు రూ.500 బోనస్ ఇస్తామని చెప్పారని, ఇప్పుడు సన్నవడ్లకే అన్నడంతో కపట కాంగ్రెస్ మార్కు మోసం, దగా, నయవంచన బయటపడిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్యారెంటీ కార్డులో అప్పుడు సన్న వడ్లకు మాత్రమే అని ఎందుకు చెప్పలేదని అడిగారు. ప్రచారంలో ప్రతి గింజకు అని ఊదరగొట్టి ప్రభుత్వంలోకి రాగానే చేతులెత్తేస్తారా ? అని చురకలంటించారు.కష్టించి పండించిన ధాన్యాన్ని కొనకుండా అకాల వర్షాలపాలు చేసి ఆగం చేశారన్నారు." ప్రతి ఏటా రైతులు, కౌలు రైతులకు రూ.15 వేలు రైతుభరోసా ఇస్తాం, వ్యవసాయ కూలీలకు రూ.12000 వేలు ఇస్తాం, ప్రతి రైతుకు డిసెంబర్ 9న రెండు లక్షల రుణమాఫీ చేస్తామని ఎందుకు చేయలేదు'' అని కెటిఆర్ చురకలంటించారు. నేడు బోనస్ విషయంలో కూడా ప్రభుత్వ బోగస్ విధానాన్ని బయటపెట్టారని దుయ్యబట్టారు. ఓట్ల నాడు ఒకమాట, నాట్ల నాడు మరోమాట చెప్పడమే కాంగ్రెస్ నైజమని, అసెంబ్లీ ఎన్నికల్లో గాలిమాటలతో గారడీ చేసిందని దుయ్యబట్టారు. కాంగ్రెస్ పార్టీ పార్లమెంట్ ఎన్నికల్లో ఓట్లు డబ్బాలో పడగానే.. నాలుగు కోట్ల ప్రజల సాక్షిగా తన నిజస్వరూపాన్ని బయటపెట్టిందని, ఎద్దేడ్సిన యవుసం, రైతేడ్చిన రాజ్యం నిలబడదని, నమ్మి ఓటేసినందుకు రైతుల గొంతు కోసిన కాంగ్రెస్ సర్కారును అన్నదాతలు ఇక వదిలిపెట్టకుండా పల్లె పల్లెనా ప్రశ్నిస్తారని, తెలంగాణ వ్యాప్తంగా నిలదీస్తారని, కపట కాంగ్రెస్ పై సమరశంఖం పూరిస్తామని, నేటి నుంచి రైతన్నల చేతిలోనే కాంగ్రెస్ సర్కారుకు కౌంట్ డౌన్ షురూ అయిందని కెటిఆర్ హెచ్చరించారు.

## తెలంగాణ పది యూనివర్సిటీలకు ఇన్‌చార్జ్ వీసీలు: ప్రభుత్వం ఉత్తర్వులు

హైదరాబాద్ మే 21 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);తెలంగాణ పది యూనివర్సిటీలకు ఇన్‌చార్జ్ వీసీలుగా ఐఏఎస్ అధికారులను నియమిస్తూ ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. నేటితో గత వీసీల పదవీ కాలం ముగిసింది. బీఆర్ఎస్ ప్రభుత్వం 2021 మే 22న పది వర్సిటీలకు వీసీలను నియమించింది. ఓయూ, కాకతీయ, జేఎన్‌టీయూ, శాతవాహన, మహాత్మాగాంధీ, తెలంగాణ, పాలమూరు, అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ, తెలుగు యూని వర్సిటీ, జవహర్‌లాల్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ వర్సిటీల వీసీల పదవి కాలం నేటితో ముగియగా.. సీనియర్ ఐఏఎస్ అధికారులను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఉస్మానియా యూనివర్సిటీకి దాన కిశోర్, జేఎన్టీయూ బాధ్యతలను బుర్ర వెంకటేశ్‌కు అప్పగించింది. కాకతీయ యూనివర్సిటీ ఇన్‌చార్జ్ వీసీగా వాకాటి కరుణ, అంబేద్కర్ ఓపెన్ వర్సిటీ రిజ్వి, తెలంగాణ వర్సిటీకి సందీప్ సుల్తానియా, తెలుగు యూనివర్సిటీ బాధ్యతలను శైలజ రామయ్యర్‌కు అప్పగించింది. మహాత్మా గాంధీ వర్సిటీకి నవీన్ మిట్టల్, శాతవాహన సురేంద్ర మోహన్, జవహర్‌లాల్ నెహ్రూ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్‌కి జయేశ్ రంజన్, పాలమూరు వర్సిటీ ఇన్‌చార్జ్ వీసీగా నదీం అహ్మద్‌ను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.

## రాజీవ్ గాంధీకి ముఖ్యమంత్రి రేవంత్ నివాళి



హైదరాబాద్, 21 :ఐటీ రంగ వృద్ధికి రాజీవ్ గాంధీ బాటలు వేశారని సీఎం రేవంత్‌రెడ్డి కొనియాడారు. రాజీవ్‌గాంధీ వర్ధంతి సందర్భంగా నగరంలోని సోమాజిగూడలో నేడు నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొని రాజీవ్ గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు.

ఈ సందర్భంగా రేవంత్ మాట్లాడుతూ, ప్రధానిగా దేశానికి ఆయన చేసిన సేవలను గుర్తు చేశారు.

ఈ కార్యక్రమంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, జానారెడ్డి, వి.హనుమంతరావు, షబ్బీర్ అలీ, పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జి దీపాదాస్ మున్షీ తదితరులు పాల్గొన్నారు.

ఇది ఇలా ఉంటే ఖమ్మం జిల్లా కూసుమంచిలో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి రాజీవ్‌గాంధీ విగ్రహానికి నివాళి అర్పించారు. అమెరికా పర్యటనలో ఉన్న మంత్రి పొన్నం ప్రభాకర్ అక్కడి న్యూయార్క్ టైమ్స్ స్క్వేర్ వద్ద నిర్వహించిన వర్ధంతి కార్యక్రమంలో పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోలు విషయంలో ప్రభుత్వంపై దుష్ప్రచారం

**-వర్షాలకు తడిచిన ధాన్యం కూడా కొంటున్నాం**

**-తడిచిన, మొలకెత్తిన ధాన్యాన్ని గత ప్రభుత్వం కొనలేదు**

**-చివరిగింజ వరకు కొనుగోలు చేస్తాం.. రైతులు ఆందోళన చెందవద్దు ..**

**-ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క**

హైదరాబాద్ మే 21 (ఎక్స్ ప్రెస్ న్యూ స్): ధాన్యం సేకరించిన వెంటనే రైతుల ఖాతాల్లో డబ్బులు జమ చేస్తున్నామని ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. తడిచిన, మొలకెత్తిన ధాన్యాన్ని గత ప్రభుత్వం కొనలేదని, తాము వర్షాలకు తడిచిన ధాన్యం కూడా కొంటున్నామని, ధాన్యం కొనుగోలు విషయంలో ప్రభుత్వంపై దుష్ప్రచారం చేస్తున్నారని, అబద్ధాలు చెప్పడం బిఆర్ఎస్ నేతలకు అలవాటుగా మారిందని భట్టి చురకలంటించారు. 15 రోజులు ముందుగానే ధాన్యం కొంటున్నామని, గతంలో కంటే ఎక్కువగా 7215 కొనుగోలు కేంద్రాలు ప్రారంభించామని, బిఆర్ఎస్ ప్రభుత్వం కంటే ఎక్కువగా తాము ధాన్యం కొనుగోలు చేశామని వివరించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో జాప్యం జరగకుండా చూస్తామని, చివరిగింజ వరకు కొనుగోలు చేస్తామని, రైతులు ఆందోళన చెందవద్దని, ధైర్యంగా, నిశ్చింతగా ఉండాలని భట్టి స్పష్టం



చేశారు. నేటి యువత సాంకేతికతను అందిపుచ్చుకోవాలని, వాతావరణ శాఖ సూచనలను రైతులకు అందించాలని, వర్షసూచనపై ఎప్పటికప్పుడు రైతులకు సమాచారం ఇవ్వాలన్నారు.

## బీజేపీకి 370 సీట్లు దాటకపోవచ్చు : ప్రశాంత్ కిషోర్

న్యూ డిల్లీ మే 21 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );లోక్‌సభ ఎన్నికల్లో భారతీయ జనతాపార్టీ విజయంపై ఎన్నికల వ్యూహకర్త ప్రశాంత్ కిషోర్ కీలక వ్యాఖ్యలు చేశారు. బీజేపీని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ మరోసారి విజయపథంలో నడిపించే అవకాశం ఉందన్నారు. అయితే, కమలం నేతలు చెబుతున్నట్లు ఆ పార్టీకి 370 సీట్లు దాటకపోవచ్చని అంచనా వేశారు. జాతీయ మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ప్రశాంత్ కిషోర్ ఈ వ్యాఖ్యలు చేశారు. 'మోదీ నేతృత్వంలోని ఎన్డీయే కూటమి మరోసారి అధికారంలోకి వస్తుందని నేను భావిస్తున్నాను. 2019 ఎన్నికల్లో గెలిచిన సీట్లకంటే ఈసారి కొంచెం ఎక్కువ స్థానాలు గెలుచుకోవచ్చు. కానీ వారు (బీజేపీ నేతలు) చెబుతున్నట్లు 370 సీట్లు మాత్రం దాటకపోవచ్చు' అని ప్రశాంత్ కిషోర్ అన్నారు.

## పట్టభద్రుల ఎమ్మెల్సీ పట్టెవరిదో మరి! హీట్ పెంచుతున్న ఉప ఎన్నిక

హైదరాబాద్, 21 :తెలంగాణలో మరో ఉప ఎన్నిక హీట్ పెంచుతోంది. వరంగల్- ఖమ్మం- నల్గొండ ఉమ్మడి జిల్లాల పరిధిలో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నిక ఈ నెల 30న జరగనుంది. కాగా, పోటీలో ఉన్న అభ్యర్థులు హోరాహోరీగా ప్రచారం చేస్తున్నారు. ఆయా పార్టీల నేతలు తమ అభ్యర్థుల గెలుపు కోసం తీవ్రంగా శ్రమిస్తున్నారు. పట్టభద్రుల నియోజకవర్గం నుంచి 2021లో ఎమ్మెల్సీగా గెలుపొందిన పల్లా రాజేశ్వర్‌రెడ్డి, ఈ మధ్య జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో జనగామ నుంచి ఎమ్మెల్యేగా గెలిచారు. దీంతో తన ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేశారు. ఈ క్రమంలో ఉప ఎన్నిక అనివార్యమైంది. మొత్తం 52 మంది ఈ స్థానానికి పోటీ పడుతుండగా, ప్రధాన పార్టీలైన కాంగ్రెస్ నుంచి తీన్మార్ మల్లన్న, బీఆర్ఎస్ నుంచి ఏనుగుల రాకేశ్ రెడ్డి, బీజేపీ నుంచి గుజ్జుల ప్రేమేందర్ రెడ్డి బరిలో ఉన్నారు.పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నికలో కాంగ్రెస్ పార్టీకి సీపీఎం మద్దతు తెలిపింది. ఈ మేరకు పార్టీ అభ్యర్థి తీన్మార్ మల్లన్న గెలుపునకు కృషి చేస్తామని, సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం స్పష్టం చేశారు. లోక్‌సభ ఎన్నికల్లో లౌకిక విలువలు, ప్రజాస్వామ్యం కోసం ఇండియా కూటమిలో భాగస్వామ్యమైన కాంగ్రెస్ పార్టీకి మద్దతు ఇచ్చామని పేర్కొన్నారు. అలాగే.. ఇప్పుడు కూడా బీజేపీని ఓడించడం కోసం కాంగ్రెస్‌తో కలిసి పని చేస్తామని తమ్మినేని వెల్లడించారు.

### ఎమ్మెల్సీ స్థానాన్ని నిలబెట్టుకోవడంపై బీఆర్ఎస్ ఫోకస్

వరంగల్- ఖమ్మం- నల్గొండ పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ స్థానాన్ని నిలబెట్టుకునేందుకు భారత రాష్ట్ర సమితి యత్నిస్తోంది. తెలంగాణలో శాసనమండలి పునరుద్ధరణ అయినప్పటి నుంచి అక్కడ గులాబీ పార్టీ అభ్యర్థులే గెలుస్తూ వస్తున్నారు. దీంతో త్వరలో జరగనున్న ఉప ఎన్నికలోనూ పార్టీ అభ్యర్థిని గెలిపించుకునేందుకు బీఆర్ఎస్ తీవ్రంగా ప్రయత్నిస్తోంది. ఇప్పటికే జిల్లాల్లో సమావేశాలు నిర్వహించడంతో పాటు మూడు ఉమ్మడి జిల్లాల నేతలతో హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ సమావేశం నిర్వహించి దిశానిర్దేశం చేశారు. ఎమ్మెల్సీ ఉప ఎన్నిక ప్రచారంలోనూ కేటీఆర్ స్పీడు పెంచారు.

### దృష్టిపెట్టిన బీజేపీ..

ఎమ్మెల్సీ ఉప ఎన్నికపై బీజేపీ ప్రత్యేక దృష్టి పెట్టింది. విజయమే లక్ష్యంగా వ్యూహాత్మకంగా ముందుకు సాగుతోంది. శాసనమండలిలో తమ బలం పెంచుకునేందుకు ఉప ఎన్నికల్లో గెలిచి సత్తా చాటాలని భావిస్తోంది. ఉద్యోగ, నిరుద్యోగ యువతకు కాంగ్రెస్, భారత రాష్ట్ర సమితి చేసిన మోసాలను వివరిస్తూ మండలిలో పట్టభద్రుల గళం వినిపించేందుకు తమ అభ్యర్థిని గెలిపించాలని కమలదళం అభ్యర్థిస్తోంది. ఆ పార్టీ అభ్యర్థి గుజ్జుల ప్రేమేందర్ రెడ్డి విజయం కోసం పార్టీ నేతలు ప్రచారం చేస్తున్నారు.

## వేములవాడ శ్రీ చైతన్య స్కూల్లో సంబరాలు




వేములవాడ, మే 21: వేములవాడ పట్టణంలోని శ్రీ చైతన్య స్కూల్ 2023-24 విద్యా సంవత్సరాన్ని విజయవంతంగా పూర్తిచేసుకుని 2025వ సవత్సరంలోకి అడుగుపెడుతున్న సందర్భంగా మంగళవారం సంబరాలు నిర్వహించారు. ఈ సంబరాల్లో భాగంగా టపాసులు పేల్చి ఉపాధ్యాయుని, ఉపాధ్యాయులు అందరికీ కూడా స్వీట్లు పంచుకున్నారు. శ్రీ చైతన్య స్కూల్ ప్రిన్సిపాల్ సుదేష్ కుమారి మాట్లాడుతూ మే 21న శ్రీ చైతన్య విద్యా సంస్థల డైరెక్టర్ శ్రీవిద్య పుట్టినరోజు సందర్భంగా శ్రీ చైతన్య విద్యా సంస్థలు ఒక లక్ష అడ్మిషన్లు మైలురాయి అందుకోవడం చాలా ఆనందంగా ఉందని అన్నారు. దీనికి సహకరించినటువంటి ఉపాధ్యాయుని, ఉపాధ్యాయులకు, మా వెన్నంటే ఉండి ప్రోత్సహించినటువంటి జిఎం నాగేంద్ర చారి, చైర్మన్ శ్రీధర్, ఏజీఎం ముద్ర కోల రాజులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డీన్ శేఖర్, సిబ్యాచ్ ఇంచార్జ్ అంజయ్య, ప్రైమరీ ఇంచార్జ్ రజిత, ప్రవళిక, ప్రీ ప్రైమరీ ఇంచార్జ్ మమత, ఏవో సుదీర్, పీఇటి సుధాకర్, మారుతి, ఉపాధ్యాయుని, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

### నేటి కందం- నేటికీ అందం

మనుగడలను నిలుపగ-జీ
వనమున ముదమొంద జీవ వైవిధ్య దినం
బును ముదమున జరుపవలయు
మనమున సంతసము నింప మహనీయముగన్

(మే 22 జీవ వైవిధ్య దినోత్సవం)



-రాధశ్రీ
సెల్:9494481210

# జీవ వైవిధ్య విచ్ఛిన్నంతో మహా విపత్తుల జననం !

**(22 మే 'అంతర్జాతీయ జీవ వైవిధ్య దినం' సందర్భంగా)**

కొన్ని బిలియన్ ఏండ్లకు పూర్వమే ఏర్పడిన భూగోళంపై నివసిస్తున్న 8 మిలియన్ల జీవరాసుల (వృక్షాలు, జంతువులు, ఫంగీ, బ్యాక్టీరియా, ఇతర సుక్ష్మ జీవులు) మనుగడకు భంగం కలుగకుండా పరిరక్షించుకుంటూ, పర్యావరణ (అడవులు, ఎడారులు, చిత్తడి నేలలు, పర్వతాలు, సరస్సులు, నదులు, చెరువులు, వ్యవసాయ భూములు) సమతుల్యతను సమర్థిస్తూ, మానవ మనుగడ సాగించడమే జీవ వైవిధ్యంగా అర్థం చేసుకోవాలి. సుస్థిర వ్యవసాయం, ఎడారీకరణ, నేల క్షీణత, మహాసముద్రాలు, గిరిజన జాతులు, ఆహార భద్రత, కరువులు, నీరు లభ్యత, పారిశుద్ధ్యం, ఆరోగ్యం, అంటువ్యాధులు, జీవనోపాధి, సుస్థిరాభివృద్ధి, శక్తి వనరులు, శాస్త్రసాంకేతికత, సృజనశీలత, విజ్ఞాన వినిమయం, పట్టణీకరణ, రవాణా, వాతావరణ మార్పులు, విపత్తు నిర్వహణ, అడవులు, పేదరికం లాంటి అనేక అంశాలు జీవ వైవిధ్యం మీదనే ఆధారపడి ఉంటాయి.

అంతర్జాతీయ జీవ వైవిధ్య దినం–2024 నినాదం:

ఐరాస నిర్థేశించిన 'సుస్థిరాఏభివృద్ధి లక్ష్యాల'లో జీవ వైవిధ్యానికి పెద్ద పీట వేయడం జరిగింది. 1993 ఐరాస జనరల్ అసెంబ్లీ తీర్మానం ప్రకారం జీవ వైవిధ్య ప్రాధాన్యతను గుర్తించి ప్రతి ఏటా 29 డిసెంబర్ రోజున ప్రత్యేక అవగాహన కల్పించేందుకు 'అంతర్జాతీయ జీవ వైవిధ్య దినం' జరుపుకోవడం జరిగింది. 22 మే 1992 రోజున జరిగిన 'రియో ఎర్థ్ సమ్మిట్'కు గుర్తుగా 22 మే రోజున జరుపుకోవాలని 20 డిసెంబర్ 2000 రోజున ఐరాస మరో నిర్ణయం తీసుకోవడం జరిగింది. అంతర్జాతీయ జీవ వైవిధ్య దినం – 2024 నినాదంగా 'జీవవైవిధ్య పరిరక్షణ ప్రణాళికలో భాగం అవుదాం(బి పార్ట్ ఆఫ్ ది ప్లాన్)' అనే అంశాన్ని తీసుకోవడం జరిగింది. జీవ వైవిధ్యానికి విఘాతం కలగడంతో మానవజాతి ప్రతి 4 మాసాలకు ఒక నూతన కోవిడ్–19 లాంటి మహా విపత్తు లేదా అంటువ్యాధికి లోనవడం జరుగుతున్నది.

## జీవ వైవిధ్య ప్రాధాన్యత:

పర్యావరణ సమతుల్యత దెబ్బ తినడానికి కారణం మానవుడి అనాలోచిత, స్వార్థపూరిత చేష్టలే అని కళ్ళు తెరవాల్సిన సమయం ఆసన్నమైంది. జీవ వైవిధ్యానికి విఘాతం కలిగితే జరిగే అనేక అనర్థాలలో నేడు మనం అనుభవిస్తున్న మహమ్మారుల కల్లోలం కూడా ఒక ప్రధాన భాగమని గుర్తుంచుకోవాలి. జీవ వనరులను, ప్రపంచ జీవ వైవిధ్యాన్ని పరిరక్షించడంతో భూతలం నివాసయోగ్యమైన సుందర నందన వనంలా మారుతుందని తెలుసుకోవాలి. ప్రకృతిలో ప్రధాన భాగాలైన వృక్ష సంపద, జంతు జాతులు, పలు రకాలైన సూక్ష్మజీవులు, జన్యు వైవిధ్యం లాంటివి పర్యావరణ సురక్షకు సోపానాలుగానే కాకుండా జీవ వైవిధ్య సౌభాగ్యాలుగా కూడా దోహదపడతాయి. కాలానుగుణంగా మానవాళి ప్రమేయంతో జరుగుతున్న పర్యావరణ విధ్వంసంలో భాగంగా జీవ వైవిధ్యానికి తీవ్ర విఘాతం కలుగుతూనే ఉంది. భూమండలంపై 66 శాతం సముద్ర జలాలే ఉన్నాయని, మానవ అనాలోచిత కార్యాలతో సముద్ర జీవరాసుల మనుగడ ప్రశ్నార్థకంగా మారుతోందని గమనించాలి. ఇలాంటి పర్యావరణ విచ్ఛిన్న కార్యాల ద్వారా ఒక మిలియన్ జీవరాసులు అంతరించే దుస్థితి ఏర్పడటం విచారకరమే కాదు ప్రమాదకరం కూడా.

## జీవవైవిధ్య విధ్వంస దుష్ప్రభావాలు:

ప్రపంచంలో 3 బిలియన్ల జీవులు జలాల్లో, 1.6 బిలియన్ జీవరాసులు అడవుల్లో మనుగడ సాగిస్తున్నాయి. సకల జీవుల మనుగడకు రక్షణ కలగాలన్నా, కరోనా లాంటి మహమ్మారుల ద్వారా సోకే అంటువ్యాధులను నియంత్రించాలన్నా జీవ వైవిధ్య పరిరక్షణ చర్యలు విధిగా జరగాల్సిందే. జీవ వైవిధ్యాన్ని విచ్ఛిన్నం చేస్తే 70 శాతం వరకు జంతు సంబంధ జునోటిక్ వ్యాధులు ప్రభలుతాయని తెలుసుకోవాలి. ప్రకృతిలో సహజ సిద్ధంగా మనుగడ సాగిస్తున్న వృక్ష, జంతుజాల సమతుల్యతకు భంగం కలిగించే ఎలాంటి చర్యలు చేయరాదు. మానవ అకారణ, అనాలోచిత క్రియలతో కొన్ని జీవరాసులు అంతరించిన యెడల వాటిపై ఆధారపడే వ్యాధికారక సూక్ష్మ క్రిములు మనవాళికి సోకడంతో భయంకర అంటురోగాలు కలుగుతాయి. జీవ వైవిధ్యం విచ్ఛిన్నమైతే వాతావరణ ప్రతికూల మార్పులు కూడా కలుగుతాయి.

## జీవజాతులు అంతరించడం:

ప్రపంచవ్యాప్తంగా ప్రతి గంటకు కనీసం 3 జీవ జాతులు, రోజుకు 100 – 150, ఏడాదికి 15,000 – 18,000 జీవజాతులు అంతరిస్తున్నాయని తేలింది. బీడు భూములు పెరగడంతో 74 రకాల కప్ప జాతులు, ధృవాల వద్ద మంచు కరగడంతో 22 శాతం పోలార్ బేర్‌లు, అంటార్కిటికాలో ఉష్ణోగ్రతలు పెరగడంతో పెంగ్విన్‌లు, నెథర్‌లాండ్‌లో వాతావరణ మార్పులతో ఫ్లైకాచర్ పక్షులు లాంటి అనేక జీవ జాతులు అంతరించే సమయం ఆసన్నమైందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

## జీవవైవిధ్య పరిరక్షణ చర్యలు:

యునెస్కో సూచనల ప్రకారం మానవ జాతికి, సహజ ప్రకృతికి సంబంధాన్ని స్థాపించడానికి పర్యావరణ పరిరక్షణ జరగాలి. పర్యావరణ సమతుల్యతకు బాటలు వేయడం, జీవ వైవిధ్య పరిరక్షణకు యువశక్తిని వినియోగించడం జరగాలి. ఈ క్రమంలో 1,121 ప్రపంచ వారసత్వ క్షేత్రాలు (వరల్డ్ హెరిటేజ్ సైట్స్), 714 జీవావరణ నిల్వలు (బయోస్ఫియర్ రిజర్వ్స్), 161 గ్లోబల్ జియో పార్కులు ఏర్పాటు చేస్తూ, 6 శాతం నేలను పరిరక్షించడం జరుగుతున్నది. అడవులను నరికివేయడం, వణ్యప్రాణుల్ని వేటాడడం, శిలాజ ఇంధనాలను వినియోగించడం, గాలి/నేల/నీటి కాలుష్యాలకు కారణం కావడం, ప్లాస్టిక్‌ను వినియోగించడం, విచక్షణారహితంగా రసాయన ఎరువులు/పురుగు మందులు వాడడం, ఆహారం/నీటిని దుర్వినియోగం చేయడం లాంటి అనేక మానవ క్రియలు జీవ వైవిధ్యానికి ప్రతిబంధకాలని తెలుసుకోవాలి.

## జీవవైవిధ్య విఘాత సృష్టికర్త మానవుడే:

ప్రకృతి అందాలను ఆస్వాదిస్తూ, సకల జీవరాశులను రక్షించుకుంటూ, జీవ వైవిధ్యాన్ని కాపాడుకుందాం. జీవ వైవిధ్య సంపదలతో విరబూసే ధరణి మానవ నివాసానికి, భూగ్రహ స్థిరత్వానికి పునాది అవుతుంది. జీవ వైవిధ్య విఘాత సృష్టి కర్త మనిషే కాబట్టి మానవుడే దాని పరిరక్షణకు సమాధానం కూడా కావాలి. సమస్యకు కారణమైన వారే సమాధానం కూడా అందించాలి.

ప్రకృతిలోని జీవులు అంతరించే దుస్థితి ఏర్పడితే, తిరిగి పూర్వపు స్థితికి రావడం వీలుకాదు. పరిస్థితులు మరింత చేయి దాటక పూర్వమే జీవ వైవిధ్యాన్ని పరిరక్షించే సత్కార్యాలు చేయటానికి విశ్వ మానవాళి, ముఖ్యంగా యువత నడుం బిగించాలి. ఇలాగే మరి కొంత సమయం నిర్లక్ష్యం చేస్తే ప్రపంచ మానవాళి భారీ మూల్యమే చెల్లించాల్సి ఉంటుందని తెలుసుకోవాలి.



– డా॥ బుర్ర మధుసూదన్ రెడ్డి,
99497 00037

# దేశ సాంకేతిక అభివృద్ధి ఆద్యుడు రాజీవ్ గాంధీ

**– రాజీవ్ గాంధీకి ఘనంగా నివాళులు**



ఖమ్మం, 21 :(నేటినిజం ప్రతినిధి): భారత దేశ సాంకేతిక అభివృద్ధికి బీజాలు వేసిన గొప్ప పరిపాలన దక్షుడు దివంగత నేత మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ అని జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు పువ్వాళ్ళ దుర్గా ప్రసాద్ కొనియాడారు. మంగళవారం రాజీవ్ గాంధీ వర్ధంతిని పురస్కరించుకుని జిల్లా కాంగ్రెస్ కార్యాలయం సంజీవరెడ్డి భవనంలో కాంగ్రెస్ నాయకులతో కలిసి రాజీవ్ గాంధీకి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన చిత్ర పటానికి పూల మాలలు వేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... పరిపాలనలో సంస్కరణలు తెచ్చిన నాయకులు, దేశ సౌభ్రాతృత్వం కాపాడటం కోసం తన ప్రాణాన్ని త్యాగం చేసిన మహనీయులు, నవ భారత నిర్మాత, భారతరత్న దివంగత ప్రధాని స్వర్గీయ రాజీవ్ గాంధీ అని అన్నారు.

అభివృద్ధి చెందుతున్న దేశాల సరసన భారతదేశాన్ని నిలిపిన ఘనత కూడా రాజీవ్ గాంధీదే నని గుర్తు చేశారు. అంతే కాకుండా భారతదేశానికి ఒక దిక్సూచిగా గాంధీ కుటుంబ సభ్యులు నిలిచారని, ఐటీ రంగాన్ని దేశానికి పరిచయం చేసి విప్లవాత్మక మార్పులు తెచ్చిన ఘనత రాజీవ్ గాంధీకే దక్కుతుందని అన్నారు. ప్రపంచంలో ఎక్కడో పుట్టిన కంప్యూటర్ రంగాన్ని దేశానికి పరిచయం, ఎంతో మంది విద్యార్థులు సాంకేతిక విద్యను నేర్చుకునేలా చేసింది కూడా రాజీవ్ గాంధీనేనని చెప్పుకొచ్చారు. దేశ యువతను సాంకేతిక రంగం వైపు మళ్ళించమే కాకుండా ప్రపంచ దేశాల ప్రముఖ కంపెనీలకు భారతీయులనే సీఈవోలుగా ప్రాతినిధ్యం వహించే స్తాయికి దేశానని ముందుకు నడిపించారని అన్నారు. ఆయన సాధించిన ఘనత నేటికీ స్ఫూర్తి దాయకం అని ప్రతి ఒక్కరూ రాజీవ్ గాంధీ చూపిన బాటలో నడవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో వీరితో పాటు నగర కాంగ్రెస్ కమిటి అధ్యక్షులు మహ్మద్ జావేద్, నగర కాంగ్రెస్ కమిటి కార్యనిర్వహక అధ్యక్షులు నాగండ్ల దీపక్ చౌదరి, మాజి ఏమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ ఛైర్మెన్ రాయల నాగేశ్వరరావు, రాష్ట్ర ఓబిసి సెల్ ఉపాధ్యక్షులు వద్దేబోయిన నరసింహరావు, జిల్లా మహిళా కాంగ్రెస్ కమిటి అధ్యక్షురాలు దొబ్బల సౌజన్య, జిల్లా మైనారిటీ అధ్యక్షులు సయ్యద్ ముజాహిద్ హుస్సేన్, జిల్లా సేవాదళ్ అధ్యక్షులు సయ్యద్ గౌస్, కార్పొరేటర్ మలీదు వేంకటేశ్వరరావు, రఘునాథపాలెం మండల అధ్యక్షులు భూక్యా బాలాజి నాయక్, జిల్లా ఓబిసి సెల్ ఉపాధ్యక్షులు గజ్జెల్లి వెంకన్న, ఓబిసి జిల్లా ప్రధాన కార్యదర్శి బమ్మిడి శ్రీనివాస్ యాదవ్, కామా అశోక్, గడ్డం వెంకటయ్య, మహమూద్, నగర కాంగ్రెస్ ఎస్టీ, ఓబిసి, సెల్ అధ్యక్షులు శంకర్ నాయక్, బాణాల లక్ష్మణ్, రజి, నూకారవు వేంకటేశ్వరావు, యాసబోయిన శ్రీశైలం, వసీం, బండి నాగేశ్వరరావు, అబ్దుల్ రెహమాన్, అంజని కుమార్, కందుల రామారావు, ఫరీద్ ఖాద్రి, దివ్య, ప్రతిభరెడ్డి, కొటేరు వెంకట నర్సిరెడ్డి తదితర నాయకులు పాల్గొన్నారు.

# మల్లన్నకు మొదటి ప్రాధాన్యత ఓటువేసి గెలిపించాలి

**– కాంగ్రెస్ నేత పరికపల్లి శ్రీనివాస్**

**– కాంగ్రెస్ నేత పరికపల్లి శ్రీనివాస్**

ఖమ్మం, 21 :(నేటినిజం ప్రతి నిధి): ప్రశ్నించే గొంతుక నిత్యం ప్రజల సమస్యలపై పోరాడే వ్యక్తి గత ప్రభుత్వంలో జరిగిన అరాచకలను ఎప్పటికప్పుడు ప్రజల ముందు ఉంచి నిజమైన జర్నలిస్టుగా ప్రజలకు వివరించిన తీన్మార్ మల్లన్నను కాంగ్రెస్ పార్టీ అధిష్టానం గుర్తించి ఉమ్మడి వరంగల్, ఖమ్మం, నల్గొండ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్సీ అభ్యర్థిగా నియమించడం చాలా సంతోషకరమైన విషయమని ఈనెల 27న జరగబోయే ఎమ్మెల్సీ ఎన్నికల్లో మల్లన్నకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి భారీ మెజారిటీ తో గెలిపించాలని కాంగ్రెస్ పార్టీ నాయకులు పరికపల్లి శ్రీనివాస్ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...నియోజక వర్గంలోని పట్టభద్రులందరూ మల్లన్నకు ఓటు వేసి గెలిపించాలని ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన గ్యారెంటీ హామీలను తప్పకుండా అమలు చేస్తుందన్నారు.

ప్రశ్నించే గొంతుక నిత్యం ప్రజల సమస్యలపై పోరాడే వ్యక్తి గత ప్రభుత్వంలో జరిగిన అరాచకలను ఎప్పటికప్పుడు ప్రజల ముందు ఉంచి నిజమైన జర్నలిస్టుగా ప్రజలకు వివరించిన తీన్మార్ మల్లన్నను కాంగ్రెస్ పార్టీ అధిష్టానం గుర్తించి ఉమ్మడి వరంగల్, ఖమ్మం, నల్గొండ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్సీ అభ్యర్థిగా నియమించడం చాలా సంతోషకరమైన విషయమని ఈనెల 27న జరగబోయే ఎమ్మెల్సీ ఎన్నికల్లో మల్లన్నకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి భారీ మెజారిటీ తో గెలిపించాలని కాంగ్రెస్ పార్టీ నాయకులు పరికపల్లి శ్రీనివాస్ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... నియోజక వర్గంలోని పట్టభద్రులం దరూ మల్లన్నకు ఓటు వేసి గెలిపించా లని ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన గ్యారెంటీ హామీలను తప్పకుండా అమలు చేస్తుందన్నారు.

# రైతులు, మహిళలకు ప్రభుత్వం గుడ్ న్యూస్..

అమరావతి, మే 21 :ఆంధ్ర ప్రదేశ్ లో రైతులు, మహిళలకు ప్రభుత్వం గుడ్ న్యూస్ తెలిపింది. లోక్ సభ ఎన్నికల అనంతరం సైతం వివిధ పథకాల ద్వారా లబ్దిదారుల ఖాతాల్లో నిధులు జమ అవుతున్నాయి. మహిళలకు వైఎస్సార్ ఆసరా పథకం నిధులను ప్రభుత్వం రిలీజ్ చేసింది. మొత్తం రూ. 1843 కోట్లను లబ్దిదారుల ఖాతాలలోకి అధికారులు జమ చేశారు.

రైతులకు కూడా ఇన్ పుట్ సబ్సీడీ డబ్బులన రిలీజ్ చేశారు. వైఎస్సార్ చేయూత పథకం కింద లబ్దిదారుల అకౌంట్లలో రూ. 1552 కోట్లు జమ చేశారు. రైతుల ఖాతాల్లో రూ. 1236 కోట్లను విడుదల చేశారు. ఈబీసీ నేస్తం కింద అగ్రవర్ణ పేదలకు రూ. 629 కోట్లు, జగనన్న విద్య దీవెన ద్వారా ఫీజు రీయింబర్స్ మెంట్ కింద విద్యార్థుల తల్లుల అకౌంట్‌లోకి రూ. 605 కోట్లను విడుదల చేసినట్లు అధికారులు వెల్లడించారు.

# 24 నుంచి పది సప్లిమెంటరీ పరీక్షలు.. షెడ్యూల్ విడుదల

అమరావతి, మే 21 : పదవ తరగతి సప్లిమెంటరీ పరీక్షలు ఈ నెల 24వ తేదీ నుంచి జరుగనున్నట్లు పాఠశాల విద్య కమిషనర్ ఎస్. సురేష్ కుమార్, ప్రభుత్వ పరీక్షల డైరెక్టర్ దేవానంద రెడ్డి తెలిపారు. ఈ మేరకు సోమవారం కమిషనర్ సురేష్ కుమార్ దేవానందరెడ్డితో కలసి అన్ని జిల్లాల విద్యాశాఖాధికారులతో ఆన్‌లైన్ (వర్చువల్) మీటింగ్ నిర్వహించారు.

పరీక్షల షెడ్యూల్‌ను విడుదల చేశారు. ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రశాంతంగా పరీక్షలు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. 24 నుంచి వచ్చే నెల జూన్ 3వ తేదీ వరకు పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 685 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు కమిషనర్ తెలిపారు. పరీక్షలకు రాష్ట్రవ్యాప్తంగా 1,61,877 మంది రిజిస్ట్రేషన్ చేసుకున్నట్లు తెలిపారు. ఉదయం 9:30 నుంచి 12:45 వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు. విద్యార్థులను ఉదయం 8:45 నుంచి 9:30 మధ్యలో పరీక్షా కేంద్రంలోకి అనుమతించనున్నట్లు తెలిపారు.

పరీక్షలు సజావుగా జరిగేలా 86 మంది ఫ్లయింగ్ స్క్వాడ్‌ను ఏర్పాటు చేశామన్నారు. విద్యార్థులను పరీక్షా కేంద్రాలలోకి చేర్చడానికి ఆర్టీసీ బస్సు సర్వీసులను ఏర్పాటు చేశామన్నారు. ఫిర్యాదుల కోసం 0866 2974540 ను సంప్రదించాలని కమిషనర్ తెలిపారు. 24వ తేదీ ఫస్ట లాంగ్వేజ్, 25 సెకండ్ లాంగ్వేజ్, 27న థర్డ్ లాంగ్వేజ్, 28న గణితం, 29న ఫిజికల్ సైన్సు, 30న బయోలాజిక్ సైన్సు, 31న సోషల్, జూన్1,2 తేదీలలో ఓఎస్ఎస్‌సీ పేర్ 1, 2 పరీక్షలను నిర్వహించనున్నట్లు కమిషనర్ సురేష్ కుమార్ తెలిపారు.

# తిరుమలలో మరోసారి చిరుతపులుల కలకలం.. మెట్ల మార్గంలో సంచారం

తిరుపతి, 21 :తిరుమలలో మరోసారి చిరుతలు సంచరిస్తున్నట్లు గుర్తించారు. సోమవారం (మే 20) అలిపిరి వాక్ మెట్లపై రెండు చిరుత పులులు సంచరిస్తూ కనిపించాయి. భక్తులు పెద్దగా కేకలు వేయడంతో చిరుతలు అడవిలోకి పారిపోయినట్లు సమాచారం.

భక్తుల నుంచి సమాచారం అందుకున్న టీటీడీ విజిలెన్స్ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని దర్యాప్తు చేస్తున్నారు. చిరుతపులి జాడలను గుర్తించేందుకు అటవీశాఖ సిబ్బంది రంగంలోకి దిగారు. మే 15న సైతం చిరుత సంచారం తిరుమలలో కలకలం రేపింది. తిరుపతి నుంచి తిరుమలకు వెళ్లే ఘాట్ రోడ్డులో భక్తుల కారుకు చిరుత అడ్డుగా వచ్చింది. సీసీ కెమెరాలో ఈ దృశ్యాలు రికార్డయ్యాయి. దాంతో టీటీడీ సిబ్బంది అలర్ట్ అయ్యారు. భక్తులు జాగ్రత్తగా ఉండాలని, గుంపులుగా వెళ్లాలని సూచించారు.

# గిరిజన బిడ్డ విజయలక్ష్మికి డాక్టరేట్

**– మండల వాసి విజయలక్ష్మి కు ఉస్మానియా యూనివర్సిటీ డాక్టరేట్**

**–సామాజిక ఉద్యమ నాయకురాలు విజయలక్ష్మి కు ఉస్మానియా డాక్టరేట్**



ఖమ్మం, 21 :(నేటినిజం ప్రతి నిధి): కూసుమంచి మండలం గైగోళ్లపల్లి పంచాయతీ పరిధిలోని హత్యతండాకు చెందిన తెలంగాణ ఉద్యమకారుడు, రాష్ట్ర గిరిజన నాయకుడు బాదావత్ లక్ష్మణ్ నాయక్ సతీమణి, సామాజిక ఉద్యమ నాయకురాలు విజయలక్ష్మి కి ఉస్మానియా యూనివర్సిటీ డాక్టరేట్ ప్రకటించింది. ఉస్మానియా యూనివర్సిటీ వాణిజ్య శాస్త్ర విభాగంలో డా.ధర్మా నాయక్ పర్యవేక్షణలో "తెలంగాణ రాష్ట్రంలో మీ–సేవా యొక్క సర్వీసుల ద్వారా వినియోగదారుల సంతృప్తి" అనే అంశం మీద చేసిన పరిశోధనకు గాను డాక్టరేట్ లభించింది. బోడియతండాలో ఒక వ్యవసాయ కుటుంబంలో భూక్య లాడియా– వీరమ్మ దంపతులకు జన్మించిన భుక్యా విజయలక్ష్మి ప్రాథమిక విద్యను బోడియతండా ప్రభుత్వ పాఠశాలలో, ఉన్నత విద్యను 10 కిలోమీటర్లు నడుచుకుంటూ వెళ్తూ వస్తూ కూసుమంచి మండల కేంద్రంలోని ప్రజ్ఞ స్కూల్ లో, ఇంటర్మీడియట్ నుండి డిగ్రీ వరకు ఖమ్మంలోనే వాణి జూనియర్ కళాశాల, ఆర్.జె.సి డిగ్రీ కాలేజీలో పూర్తి చేశారు. ఆ తర్వాత నిజాం కాలేజీ హైదరాబాద్ లో ఎం.కాం. పిజిను అభ్యసించి ఉస్మానియా యూనివర్సిటీలో లైబ్రరీ సైన్స్ డిగ్రీ కూడా సాధించారు. నేడు అదే యూనివర్సిటీలో కామర్స్ విభాగంలో పీహెచ్డీ పట్టా అందుకున్నారు. పోస్ట్ గ్రాడ్యుయేట్ పూర్తి అయ్యాక వైవాహిక జీవితాన్ని అనుభవిస్తూ, ఇద్దరు పిల్లలను చదివించుకుంటూ తన కర్తవ్యాన్ని మరిచిపోకుండా పీహెచ్డీ పట్టా సాధించిన విజయలక్ష్మి పై తండావాసులు, సహచరులు, పలువురు ప్రశంసల వర్షం కురిపిస్తున్నారు. ఈ సందర్భంగా విలేకరులతో విజయలక్ష్మి మాట్లాడుతూ...నా పరిశోధనకు సహాయపడ్డ నా కుటుంబ సభ్యులకు, ప్రత్యక్షంగా పరోక్షంగా సహాయపడ్డ ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలియజేశారు.

# పుష్పాలంకరణ వేడుకలో వైరా ఆత్మ కమిటీ చైర్మన్



ఖమ్మం, 21 :(నేటినిజం ప్రతినిధి): కొణిజర్ల మండలం పల్లిపాడు గ్రామానికి చెందిన బత్తుల శేషగిరి–భూలక్ష్మి దంపతుల కుమార్తె చిన్నారి నందిని పుష్పాలంకరణ వేడుక కార్యక్రమంలో పాల్గొని ఆశీర్వదించిన వైరా నియోజకవర్గ ఆత్మకమిటీ చైర్మన్ కోసూరి శ్రీనివాసరావు, కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు రాయల పుల్లయ్య, కొనకంచి మోషే తదితరులు పాల్గొన్నారు.

# రెండు నెలల స్టైఫండ్ పెండింగ్ .. రేపటి నుంచి సమ్మె బాటలో జూనియర్ డాక్టర్స్..



హైదరాబాద్, 21 :తెలంగాణలో రేపటి నుంచి జూడాలు సమ్మెకు దిగనున్నారు. రెండు నెలలుగా స్టైఫండ్ పెండింగ్..ఉందని?వాటిని విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ రేపటి నుంచి జూడాలు సమ్మెకు దిగనున్నారు. పెండింగ్ లో ఉన్న మార్చి, ఏప్రిల్ నెలల స్టైఫండ్ చెల్లించాలని కోరినా వైద్య శాఖ నుంచి సరైన స్పందన లేదంటున్నారు వైద్యులు .. ఇక వైద్య ఆరోగ్య శాఖ మంత్రి ఇటీవలే ప్రతినెలా 15లోపు స్టైఫండ్ విడుదల చేస్తామని చెప్పారు. అయినా ఇంకా 2 నెలల స్టైఫండ్ రాలేదని, ఆర్థిక శాఖ నుండి రెండు, మూడు రోజుల్లో స్టైఫండ్ విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ రేపటి నుంచి జూనియర్ డాక్టర్లు సమ్మెకు దిగనున్నారు.

# బతుకమ్మ కుంటలో అధికారుల అండతో అక్రమ నిర్మాణం

హైదరాబాద్ మే 21 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);నగరం లోని శివమ్ రోడ్ బతుకమ్మ కుంటలో 90 గజాల స్థలానికి మూడు ఫ్లోర్లు పెంట్ హౌస్ వేసిన జిహెచ్ఎంసి ట్యాక్స్ ఇన్స్పెక్టర్ దేవేందర్ సామాన్యులకు ఒక నిబంధన జిహెచ్ఎంసి ఉద్యోగులకు ఒక నిబంధన లకు విరుద్ధంగా అక్రమ నిర్మాణం చేపట్టాడని శివ సేన రాష్ట్ర అధ్యక్షులు ఏ.సుదర్శన్ ఆరోపించారు. పై అధికారులు దీనిపై వెంటనే తగు చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేసారు. ఇట్టి అక్రమ నిర్మాణం పై ప్రశ్నిస్తే నేను నేను జిహెచ్ఎంసిలో టాక్స్ ఇన్స్పెక్టర్ ని నన్ను ఎవరు ఏం చేయలేరు అంటూ నిర్మాణం కొనసాగిస్తున్నాడని పేర్కొన్నారు. ఈ అక్రమ నిర్మాణం కు సెక్షన్ ఆఫీసర్ శ్రీధర్ మరియు కాంట్రాక్టు ఉద్యోగి రిజ్వి బిఆర్ఎస్ సీనియర్ నాయకులు జీవన్ గౌడ్ పూర్తిగా సహాయ సహకారాలు అందిస్తున్నారని సుదర్శన్ పేర్కొన్నారు.

ప్రముఖ కవి, రచయిత,
చిత్ర కారులు
శీలా వీర్రాజు గారి
ద్వితీయ వర్ధంతి



22-4-1939
1 - 6 -2022

శీలావీ రెండు పుస్తకాల
ఆవిష్కరణ

శీలావీ పేరిట ఒక కవికీ,
ఒక ఆర్టిస్టు కి అవార్డులు

1 జూన్ 2024 సా. 5-30 కి
రవీంద్రభారతి మినీహాల్ లో
వివరాలు త్వరలో...

నిర్వహణ :
శ్రీమతి శీలా సుభద్రాదేవి
అధ్యక్షులు
శీలావీ కవిత్వ చిత్ర
కళా వేదిక

# జెమిని టీవీలో మే 27నుండి అద్భుత దృశ్యకావ్యం శ్రీమద్ రామాయణం సీరియల్ ప్రారంభం

**-మే 27 నుండి జూన్ 1 వరకు ప్రసారమయ్యే" ఎపిసోడ్స్ పై కాసుల వర్షం" అనే కాంటెస్ట్"**

**-6 రోజులపాటు ఎపిసోడ్స్ పై అడిగే ప్రశ్నలకు సమాధానాలు చెప్తే 1000 రూపాయిలు**

**- ప్రతి రోజు 500 మంది లక్కీ విజేతలని ఎంపిక**

హైదరాబాద్ మే 21 (ఎక్స్ ప్రెస్ న్యూస్ ); జెమిని టివిలో మే 27నుండి అద్భుత దృశ్యకావ్యం శ్రీమద్ రామాయణం సీరియల్ ప్రారంభవవుతుంది. మానవ సమాజానికి ఆదర్శవంతమైన విలువలను చాటి చెప్పిన శ్రీ మహా విష్ణువు అవతార గాథే " శ్రీ మద్ రామాయణం". తండ్రి మాట జవదాటని కొడుకుగా, అన్నగా, ఏకపత్నీవ్రతుడిగా, స్నేహితుడిగా, ప్రజల క్షేమం కోసం ధర్మం తప్పని రాజుగా, అందరికి ఆదర్శంగా నిలిచిన శ్రీరామగాథను ఎన్ని సార్లు చూసినా తనివి తీరదు. ఈ శ్రీమద్ రామాయణం సీరియల్ లో.. శ్రీ రాముని అవతార విశిష్టత , జన్మ వృత్తాంతం,... లంకాధిపతి అయిన రావణాసురుడి జన్మ వృత్తాంతం మొదలుకుని రామాయణంలోని అన్ని ఘట్టాలను కనులకు కట్టినట్లుగా అద్భుతమైన సాంకేతిక విలువలతో అత్యద్భుతంగా చిత్రీకరించి శ్రీ రామ గాథను జెమిని టివి అభిమాన ప్రేక్షకులందరికి ఎప్పటికి గుర్తుండి పోయేలా అందించడం జరుగుతోంది. శ్రీ వాల్మీకి విరచిత రామాయణం " శ్రీమద్ రామాయణం"గా సూపర్ గ్రాఫిక్ టెక్నాలజీతో, అనుభవజ్ఞులైన




నటీనటుల పెరఫార్మెన్సు తో, మనుసుని ఆకట్టుకునే డైలాగ్స్ తో , ప్రతి తెలుగు ప్రేక్షకుడిని అలరించడానికి మే 27 వ తేదినుండి. సోమవారం నుండి శనివారం వరకు, ప్రతి రోజు సాయంత్రం 6 గంటల 30 నిమిషాలనుండి 7 గంట 30 నిమిషాల వరకు ప్రసారం కానుంది. శ్రీమద్ రామాయణం సీరియల్ ప్రారంభ సందర్భంగా జెమిని టివి, "జెమినిలో కాసుల వర్షం" అనే కాంటెస్ట్"ని నిర్వహిస్తోంది. మే 27 నుండి జూన్ 1 వరకు ప్రసారమయ్యే శ్రీమద్ రామాయణం సీరియల్ ఎపిసోడ్స్ లో ఆరు రోజులపాటు అడిగే ప్రశ్నలకు ప్రేక్షకులు మిస్డ్ కాల్ ద్వార సమాధానాలను తెలియజేసి 1000 రూపాయిల నగదు బహుమతిని పొందే అవకాశం ఈ కాంటెస్ట్ ద్వారా లభిస్తుంది. ప్రతి రోజు 500 మంది లక్కీ విజేతలని ఎన్నుకుంటారు. ఈ అవకాశం ఈనెల 27 నుండి జూన్ 01 వరకు మాత్రమే..!ప్రతిరోజు సాయంత్రం 6.30ని.ల నుండి రాత్రి 9 గంటల వరకు జెమిని టివి చూడండి జెమినిలో కాసుల వర్షం కాంటెస్ట్ లో పాల్గొనండి ? లక్కీ విజేతలుగా నగదు బహుమతిని గెలవండి.

# మరమలైనగర్ సమీపంలో సిగ్నల్ లోపం

**-ఒకే ట్రాక్‌పై నాలుగు సబర్బన్ రైళ్లు..తప్పినా గోర ప్రమాదం**

చెన్నై మే 21 (ఎక్స్ ప్రెస్ న్యూస్); చెంగల్పట్టు జిల్లా మరమలైనగర్ సమీపంలో ఒకే ట్రాక్‌పై నాలుగు సబర్బన్ రైళ్లుఒకదాని వెనుక ఒకటి అతి దగ్గరగా ఆగిన సంఘటన కలకలం రేపింది. సాంకేతికలోపం కారణంగా సిగ్నల్ పనిచేయకపోవడంతో ఈ తప్పిదం జరిగిందని రైల్వే భద్రతా విభాగం అధికారులు తెలిపారు. రాజధాని నగరం చెన్నై నుంచి పొరుగు జిల్లాలైన చెంగల్పట్టు, కాంచీపురం, తిరువళ్లూర్ జిల్లాలకు ప్రతిరోజు నడుపుతున్న సబర్బన్ రైళ్లలో వేలాది మంది ప్రయాణం చేస్తున్నారు.

చెన్నై బీచ్-తాంబరం-చెంగల్పట్టు మధ్య నాలుగు రైలు మార్గాలున్నాయి. వీటిలో రెండు మార్గాల్లో ఎక్స్‌ప్రెస్ రైళ్లు, మిగతా రెండు మార్గాల్లో సబర్బన్ రైళ్లు నడుపుతున్నారు.

# నర్సింగ్ ఆఫీసర్లకు పెండింగ్‌లో ఉన్న జీతాలను వెంటనే చెల్లించాలి

**-బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావు డిమాండ్**

హైదరాబాద్ మే 21 (ఎక్స్ ప్రెస్ న్యూస్);: కొత్తగా నియమితులైన 4 వేల మంది నర్సింగ్ ఆఫీసర్లకు నాలుగు నెలలుగా పెండింగ్‌లో ఉన్న జీతాలను ప్రభుత్వం వెంటనే చెల్లించాలని బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావు డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో జరిగిన 7 వేల మంది నర్సింగ్ ఆఫీసర్ల నియామక ఘనతను తన ఖాతాలో వేసుకున్న కాంగ్రెస్ ప్రభుత్వం.. నాలుగు నెలలుగా వారికి జీతాలు మాత్రం చెల్లించడం లేదని విమర్శించారు. ఎల్బీ స్టేడియం వేదికగా అట్టహాసంగా నియామక పత్రాలు అందించి గాలికి వదిలేసింది తప్ప, వారి జీత భత్యాల గురించి అస్సలు పట్టించుకోవడం లేదంటూ సామాజిక మాధ్యమం ఎక్స్‌లో ట్వీట్ చేశారు.దీంతో డైరెక్టరేట్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ పరిధిలో నియమితులైన 4 వేల మంది నర్సింగ్ ఆఫీసర్లకు జీతాలు అందక అష్టకష్టాలు పడుతున్నారని, ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చెప్పారు. ప్రతి నెల ఒకటో తేదీన జీతాలు చెల్లిస్తున్నట్లు లేని గొప్పలు చెప్పుకుంటున్న కాంగ్రెస్ ప్రభుత్వం, ఇప్పటికైనా వాస్తవాలు గుర్తించాల న్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి పెండింగ్‌లో ఉన్న నాలుగు నెలల జీతాలును తక్షణమే చెల్లించాలన్నారు.

# భావితరాల భవిష్యత్ విద్యపైనే ఆధారపడి ఉంటుంది

**-విద్య అంటే ర్యాంకులు, మార్కులు కాదు.. విజ్ఞాన సముపార్జన**




అమరావతి మే 20 (ఎక్స్ ప్రెస్ న్యూస్ ); : భావితరాల భవిష్యత్ విద్యపైనే ఆధారపడి ఉంటుందని సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి ఎన్వీ రమణ అన్నారు. సోమవారం పల్నాడు జిల్లా నరసరావుపేటలో ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా జస్టిస్ ఎన్వీ రమణ మాట్లాడుతూ.. మానవాళి సమస్యలన్నింటికి విద్య ద్వారానే పరిష్కారం లభిస్తుందని చెప్పారు. శాస్త్రీయమైన విద్యతోనే మానవ ప్రగతి ఆధారపడి ఉంటుందని పేర్కొన్నారు.విద్య అంటే ర్యాంకులు, మార్కులే కాదన్నారు. విజ్ఞాన సముపార్జనే చదువు ముఖ్య ఉద్దేశమని స్పష్టం చేశారు. విద్యార్థుల తల్లిదండ్రులు మార్కుల కోసం ఒత్తిడి తీసుకురాకూడదని సూచించారు. స్వేచ్ఛాయుత వాతావరణంలో మాత్రమే పిల్లలు శారీరకంగా, మానసికంగా ఎదుగుతారన్నారు. విద్యార్థులు భవిష్యత్‌లో ఏ స్థాయికి చేరుకున్నా మూలాలు మరిచిపోవద్దని సూచించారు.

# వచ్చే సీజన్ నుంచి సన్నవడ్లపై రూ.500 బోనస్

**-తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జూన్ 2న సోనియా గాంధీ**

**-రైతులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా కొనుగోలు ప్రక్రియ..కలెక్టర్లు బాధ్యతలు**

**-విద్యకు పెద్దపీట.. అమ్మ ఆదర్శ కమిటీల ద్వారా స్కూళ్ల నిర్వహణ**

**-ఆగస్టు 15లోగా రైతులకు రుణమాఫీ**

**-"మంత్రి వర్గ సమావేశంలో కీలక నిర్ణయాలు**

హైదరాబాద్ మే 21 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );: ఎన్నికల సంఘం షరతుల మేరకు నిర్వహించిన తెలంగాణ కేబినెట్ భేటీ ముగిసింది. సీఎం రేవంత్ రెడ్డి సమక్షంలో జరిగిన ఈ భేటీలో సుమారు 4 గంటలపాటు పలు అంశాలపై మంత్రులు చర్చించారు.తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జూన్ 2న సోనియా గాంధీని తెలంగాణకు పిలవాలని కేబినెట్ నిర్ణయించింది. వచ్చే సీజన్ నుంచి సన్నవడ్లపై రూ.500 బోనస్ ఇవ్వాలని కేబినెట్ నిర్ణయించింది. ధాన్యం కొనుగోళ్లను వేగవంతంగా చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. రైతులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా కొనుగోలు ప్రక్రియ సాఫీగా కొనసాగేందుకు కలెక్టర్లు బాధ్యతలు తీసుకోవాలని ప్రభుత్వం ఆదేశించింది.తడిచిన ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, శ్రీధర్ బాబు మీడియాకు వెల్లడించారు. రేపటి నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లు, సబ్‌కలెక్టర్లు ధాన్యం కొనుగోలు కేంద్రాలను సందర్శించాలని మంత్రులు తెలిపారు. ఇక నకిలీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు తీసుకోవాలని కేబినెట్ నిర్ణయించిందని చెప్పారు. రైతులు లూజు విత్తనాలు కొనొద్దని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సూచించారు.మరోవైపు విద్యకు పెద్దపీట వేయాలని తెలంగాణ కేబినెట్ నిర్ణయించింది. అమ్మ ఆదర్శ కమిటీల ద్వారా స్కూళ్ల నిర్వహణ చేపట్టేందుకు కేబినెట్ నిర్ణయించిందని మంత్రులు వెల్లడించారు. జూన్ 12 స్కూళ్లు ప్రారంభమయ్యే సమయానికి తగు చర్యలు తీసుకునేందుకు సిద్ధమైంది. ఇక జూన్ 2న రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం కాంగ్రెస్ అగ్రనేత సోనియా గాంధీని ఆహ్వానించాలని కేబినెట్ నిర్ణయించింది.

**రాష్ట్ర అవతరణ వేడుకలకు కేసీఆర్‌కు ఆహ్వానం: మంత్రి శ్రీధర్ బాబు**

రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలకు ప్రభుత్వం తరపున మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌కు ఆహ్వానం ఇస్తామని మంత్రి శ్రీధర్ బాబు వెల్లడించారు. పాఠశాలలు పున:ప్రారంభమయ్యే జూన్ 12 లోగా విద్య వ్యవస్థలో మార్పులు చూపించాలని కేబినెట్ నిర్ణయించిందని ఆయన వెల్లడించారు. "మంత్రి వర్గ సమావేశంలో అనేక అంశాలు చర్చకు



వచ్చాయి. ధాన్యం కొనుగోలు విషయంలో ఒక్క గింజ కూడా తరుగు లేకుండా తీసుకుంటాం. మూడు రోజుల్లో పేమెంట్ అయ్యేలా చూస్తాం. స్టాండింగ్ క్రాప్ అంశంలో కూడా ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూస్తాం. వ్యవసాయ శాఖ మంత్రి అకాల వర్షాలపై సమీక్షిస్తున్నారు. విద్య వ్యవస్థకు సంబంధించి అన్ని చర్యలు పక్కాగా ఉంటాయి. పాఠశాల, సాంకేతిక, హై యర్ ఎడ్యుకేషన్‌ను గత ప్రభుత్వం విస్మరించింది. బోధన, బోధనేతర అంశాలపై కేబినెట్ నిర్ణయం తీసుకుంది. రాబోయే రోజుల్లో మానవ వనరులపై సమీక్ష నిర్వహిస్తాం. ఇందుకోసం రూ.600 కోట్లను ప్రభుత్వం విడుదల చేసింది" అని శ్రీధర్ బాబు తెలిపారు.ఇక మేడిగడ్డ అంశంలో ఎన్‌డీఎస్ఏ బృందం ఇచ్చిన నివేదిక ఆధారంగా ముందుకు వెళతామని మంత్రి శ్రీధర్ బాబు వెల్లడించారు. కేవలం సాంకేతిక పరమైన నిర్ణయాలను మాత్రమే పరిగణలోకి తీసుకోకుండా అన్ని అంశాలను ఇంజనీర్లతో మాట్లాడి ముందుకు వెళతామని తెలిపారు. మెడిగడ్డ, అన్నారం , సుందిళ్ళలను సందర్శిస్తామని ఆయన తెలిపారు.

**ఆగస్టు 15లోగా రుణమాఫీ చేసి తీరుతాం: మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి**

ఆగస్టు 15లోగా రుణమాఫీ చేసి తీరుతామని మంత్రి కోమటి రెడ్డి వెంకటరెడ్డి తెలిపారు. " ధాన్యం కొనుగోలు అన్ని చోట్ల జరుగుతుంది. ఉత్తర తెలంగాణలో కొన్ని చోట్ల చేయాల్సి ఉంది. ధాన్యం కొనుగోలుపై బీఆర్ఎస్ చేసినవి అన్నీ డ్రామాలు. పదేళ్లు మీరు రైతుల కోసం ఏం చేశారో తెలుసు. ఆగస్టు 15 లోగా రుణమాఫీ చేసి తీరుతాం. డీఎస్సీ నోటిఫికేషన్‌పై మా ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉంది. గత పదేళ్లు ఉద్యోగాల నోటిఫికేషన్లు లేవు. కేబినెట్ భేటీకి సంబంధించిన చాలా అంశాలను జూన్ 5 న తెలియజేస్తాం. జూన్ 2 రాష్ట్ర అవతరణ దినోత్సవం ఘనంగా నిర్వహిస్తాం" అని అన్నారు.

# ఏపీ అల్లర్లపై సిట్ ప్రాథమిక దర్యాప్తు పూర్తి

**-ఆదివారం అర్ధరాత్రి వరకు కొనసాగిన ప్రత్యేక విచారణ బృందం దర్యాప్తు**

**- కేంద్ర ఎన్నికల సంఘానికి సిట్ 150 పేజీలతో సుదీర్ఘ నివేదిక**

**-దర్యాప్తులో అనేక లోపాలు: డీజీపీ హరీశ్ కుమార్ గుప్తా**

**-నిందితుల అరెస్టుకు కీలక ఆదేశాలు: సిట్ చీఫ్ వినీత్ బ్రిజ్‌లాల్**

అమరావతి మే 21 (ఎక్స్ ప్రెస్ న్యూస్);: ఏపీ సార్వత్రిక ఎన్నికలకుపోలింగ్ (మే -13) ముగిసిన తర్వాత జరిగిన అల్లర్లపై స్పెషల్ ఇన్వెస్టిగేషన్ టీమ్(సిట్) ప్రాథమిక దర్యాప్తు పూర్తి చేసింది. ఏపీలోని పల్నాడు, నరసరావుపేట, తాడిపత్రి, తిరుపతిలో జరిగిన ఘటనలపై సిట్ అధికారులు ముమ్మరంగా దర్యాప్తు జరిపారు. ఈ దర్యాప్తు చేసిన నివేదికను ఈరోజు(సోమవారం) సిట్ అధికారులు డీజీపీ హరీష్ కుమార్ గుప్తాకు అందజేశారు. రాష్ట్రంలో ఎన్నికల రోజు, తర్వాత హింసపై సిట్ ప్రాథమిక నివేదిక అందజేసింది. అనంతరం సీఈవో ఎంకే మీనాకు, కేంద్ర ఎన్నికల సంఘానికి సిట్ 150 పేజీలతో సుదీర్ఘ నివేదిక ఇచ్చింది.

ఆదివారం అర్ధరాత్రి వరకు ప్రత్యేక విచారణ బృందం దర్యాప్తు కొనసాగించింది. 33 హింసాత్మక ఘటనలు జరిగినట్లు సిట్ అధికారులు గుర్తించారు. హింసాత్మక ఘటనలపై నమోదైన ఎఫ్ఐఆర్‌ను సిట్ అధికారులు పరిశీలించారు. 150 పేజీలతో సుదీర్ఘ నివేదికను డీజీపీ హరీష్ కుమార్ గుప్తాకు సిట్ చీఫ్ వినీత్ బ్రిజ్ లాల్ సమర్పించారు. అలాగే ఎన్నికల సంఘానికి నివేదికను ఇవ్వనున్నారు. మొత్తం ఐదు అంశాలపై సిట్ అధికారులు ప్రాథమిక దర్యాప్తు చేశారు. డీజీపీని కలిసి సిట్ చీఫ్ వినీత్ బ్రిజ్ లాల్ నివేదికను సీఈఓ ఎంకే మీనాకు అందజేశారు.

దర్యాప్తులో అనేక లోపాలు: డీజీపీ హరీశ్ కుమార్ గుప్తా

అల్లర్లపై డీజీపీ హరీశ్ కుమార్ గుప్తాకు సిట్ నివేదిక అందజేసింది. అనంతరం డీజీపీ మీడియాకు పలు వివరాలు వెల్లడించారు. దర్యాప్తులో అనేక లోపాలు గుర్తించినట్లు చెప్పారు. నిందితుల అరెస్ట్‌కు ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. రెండు గ్రూపులుగా విడిపోయి కర్రలతో దాడులకు తెగబడ్డారన్నారు. ఈ అల్లర్లను చాలా తీవ్రమైన నేరాలుగా పరిగణిస్తున్నామని చెప్పారు.మరణాలకు దారి తీసే స్థాయిలో రాళ్ల దాడికి తెగబడ్డారని అన్నారు. ఇప్పటికే నమోదు చేసిన కేసుల్లో అదనపు సెక్షన్లు జోడించటానికి కోర్టుల్లో మెమో దాఖలు చేయాలని విచారణ అధికారులను ఆదేశించారు. సీసీ టీవీ ఫుటేజ్, వీడియో ఫుటేజ్‌లను డిజిటల్ సాక్ష్యాలుగా సేకరించాలని చెప్పారు. అల్లర్లకు పాల్పడ్డ వారిని అరెస్టులు చేయటంతో పాటు చార్జీ షీట్లు దాఖలు చేయాలని డీజీపీ హరీశ్ కుమార్ గుప్తా ఆదేశించారు.

నిందితుల అరెస్టుకు కీలక ఆదేశాలు: సిట్ చీఫ్ వినీత్ బ్రిజ్‌లాల్

అల్లర్లకు సంబంధించి 150 పేజీలతో ప్రాథమిక నివేదికను డీజీపీకి అందించామని స్పెషల్ ఇన్వెస్టిగేషన్ టీమ్(సిట్) చీఫ్ వినీత్ బ్రిజ్‌లాల్ తెలిపారు. మొత్తం 33కేసుల్లో వివరాలను డీజీపీ పరిశీలించినట్లు తెలిపారు. దర్యాప్తులో చాలా లోపాలను గుర్తించి, సంబంధిత అధికారులకు సరైన ఆదేశాలు ఇచ్చామని తెలిపారు. జిల్లా స్థాయిలో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి, నిందితులను అరెస్టు చేయాలని ఆదేశించామన్నారు.సరైన సెక్షన్లతో కోర్టులో మెమో వేసి, ప్రస్తుతం ఉన్న సెక్షన్లకు అదనంగా కలపాలని ఆదేశించామని తెలిపారు. డిజిటల్ ఎవిడెన్స్ కింద సీసీ టీవీ ఫుటేజీ, వీడియోలను కూడా సేకరించాలని అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. సాధ్యమైనంత త్వరగా ఛార్జిషీట్ వేయాలని చెప్పామన్నారు.

సిట్ పర్యటనలో అనేక మంది బాధితులు వచ్చి విజ్ఞాపనలు ఇచ్చారని అన్నారు. వాటిని కూడా పరిశీలనకు పంపామని చెప్పారు. క్షేత్రస్థాయిలో బృందాలు పర్యటించి దర్యాప్తు అధికారులు, బాధితులు, ఇతర వర్గాల నుంచి సమాచారం సేకరించాయని సిట్ చీఫ్ వినీత్ బ్రిజ్‌లాల్ తెలిపారు.

1370 మందిని గుర్తించాం..

సాక్షుల స్టేట్‌మెంట్లు కూడా క్షుణ్ణంగా పరిశీలించినట్లు చెప్పారు. జరిగిన సంఘటనల ఆధారంగా సెక్షన్లు పెట్టారా, అన్ని సంఘటనలపై కేసులు నమోదు చేశారా లేదా అనేది పరిశీలించినట్లు తెలిపారు. అరెస్టు అయిన నిందితులు నిజమైన వారా లేదా కూడా పరిశీలించామని అన్నారు. మొత్తం 33 కేసుల్లో 1370 మందిని నిందితులుగా చూపారని అన్నారు. ఇందులో 124 మందిని అరెస్టు చేశారని చెప్పారు.పల్నాడు, తిరుపతి, అనంతపురాల్లో నమోదైన కేసులు, నిందితులు, అరెస్టు అయిన వారి వివరాలు, గుర్తించిన వారు తదితర వివరాలను వెల్లడించారు. జరిగిన సంఘటనలను తీవ్రమైన నేరాలుగా సిట్ పరిగణించిందని చెప్పారు. గ్రూపులుగా విడిపోయి విచక్షణా రహితంగా రాళ్లతో ఘర్షణలకు దిగారన్నారు. తాము ఇచ్చిన నివేదికను డీజీపీ పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారని చెప్పారు. ఈ నివేదికను పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని జిల్లా ఎస్పీలు, అనంతపురం డీఐజీ, గుంటూరు రేంజ్ ఐజీలను డీజీపీ ఆదేశించినట్లు సిట్ చీఫ్ వినీత్ బ్రిజ్‌లాల్ తెలిపారు.

అల్లర్లు జరిగిన ప్రాంతాల్లో పలువురు అధికారులకు పోస్టింగులు

కాగా.. హింసాత్మక ఘటనలకు బాధ్యులు కావడంతో సస్పెండ్ అయిన అధికారుల స్థానంలో కొత్తవారికి పోస్టింగులు వచ్చాయి. నరసరరావుపేట డీఎస్పీగా ఎం సుధాకర్ రావు, గురజాల డీఎస్పీగా సీహెచ్ శ్రీనివాసరావు, తిరుపతి డీఎస్పీగా కే.రవి మనోహర్ చారి, తాడిపత్రి డీఎస్పీగా కే జనార్దన్ నాయుడు, తిరుపతి ఎస్‌బీగా ఎం వెంకట్రాది, పల్నాడు స్పెషల్ బ్రాంచ్ సీఐలుగా బీ.సురేష్ బాబు, యూ.శోభన్ బాబులు, కారంపూడి ఎస్ఐగా కే.అమీర్, నాగార్జున సాగర్ ఎస్ఐగా ఎం పట్టాభి, తిరుపతి ఎస్‌బీ ఇన్‌స్పెక్టర్‌గా ఏ విశ్వనాథ్, అలిపిరి సీఐగా ఎం రామారావు, తాడిపత్రి సీఐగా వీ.నాగేంద్ర ప్రసాద్‌లు నియామకం అయ్యారు. ఈ అధికారులు అందరినీ తక్షణమే విధుల్లో చేరేలా ఉత్తర్వులు ఇవ్వాలంటూ డీజీపీకి ఎన్నికల కమిషన్ ఆదేశాలు జారీ చేసింది. ముగ్గురు అధికారుల ప్యానల్లో ఒకరిని ఎంపిక చేసి ఎన్నికల సంఘం పోస్టింగులు ఇచ్చింది.

సిట్‌కు వైసీపీ నేతల ఫిర్యాదు

పోలింగ్ అనంతరం రాష్ట్రంలో చోటు చేసుకున్న పరిణామాలపై సిట్ అధికారులకు వైసీపీ నేతలు ఫిర్యాదు చేశారు. మంగళగిరిలోని సిట్ కార్యాలయంలో ఈరోజు(సోమవారం) ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు చేసిన వారిలో మల్లాది విష్ణు, కైలా అనిల్ కుమార్, ఏళ్ల అప్పిరెడ్డి, పేర్ని నాని, జోగి రమేష్, అంబటి రాంబాబు తదితరులు ఉన్నారు.

# లేటెస్ట్ టెక్నాలజీ ప్రభావంపై జెఫ్రీ హింటన్ హెచ్చరిక

**-ఏఐతో మనుషులు చేసే ఉద్యోగాలు కనుమరుగవుతాయి**

**-మానవాళి విధ్వంసానికి ఏఐ దారితీస్తుంది**

న్యూ డిల్లీ మే 21 (ఎక్స్ ప్రెస్ న్యూస్): మరికొందరు నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఇక ఏఐ గాడ్‌ఫాదర్లలో ఒకరిగా చెబుతున్న జెఫ్రీ హింటన్ గత ఏడాదిగా లేటెస్ట్ టెక్నాలజీ ప్రభావంపై హెచ్చరిస్తున్నారు. ఏఐతో పొంచిఉన్న ముప్పుపై హింటన్ ఇటీవల మరోసారి తన ఆందోళన వ్యక్తం చేశారు. ఏఐతో మనుషులు చేసే ఉద్యోగాలు కనుమరుగవుతాయని హెచ్చరించింది

.2022లో చాట్‌జీపీటీ లాంఛ్ అనంతరం ఇంటరాక్టివ్ ఏఐ చాట్‌బాట్స్‌పై టెక్ ప్రపంచంలో హాట్ డిబేట్ సాగింది. చాట్‌జీపీటీకి విశేష ఆదరణ లభించడంతో ప్రమోటింగ్ కంపెనీ ఓపెన్‌ఏఐ, కంపెనీ సీఈవో సాం ఆల్ట్‌మాన్‌కు ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు లభించింది. ఆపై చాట్‌జీపీటీ ప్రాచుర్యం పొందడంతో పలు టెక్ దిగ్గజ కంపెనీలు తమ సొంత చాట్‌బాట్‌లను లాంఛ్ చేశాయి. ఇక ఏఐతో నూతన అవకాశాలు ముందుకొస్తాయని, మానవులకు తమ దైనందిన జీవితంలో ఏఐ సాయపడుతుందని కొందరు నిపుణులు చెబుతున్నారు. ఏఐతో మనుషులు చేసే ఉద్యోగాలు



కనుమరుగవుతాయని, దీనిపైనే తాను కలత చెందుతున్నానని ఓ వార్తా సంస్థతో మాట్లాడుతూ ఆయన చెప్పుకొచ్చారు. అయితే నూతన టెక్నాలజీ ఉత్పాదకతను పెంచి సంపదను సృష్టించినా అది తిరిగి సంపన్నుల చేతికి చేరుతుందని ఆవేదన వ్యక్తం చేశారు.ఏఐతో ప్రపంచానికి మేలు చేకూరి సంపదను సమకూర్చినా అది ఈ టెక్నాలజీతో ఉద్యోగాలు కోల్పోయిన వారికి, సామాన్యులకు చెందకుండా కేవలం డబ్బున వారి చేతుల్లోకే వెళుతుందని, ఇది సమాజానికి చేటు చేస్తుందని చెప్పారు. ప్రజలకు కనీస రాబడిని ప్రభుత్వం సమకూరిస్తే ఏఐ కారణంగా వారు ఇబ్బందులకు లోనుకాకుండా చూడవచ్చని హింటన్ సూచించారు. తనను సంప్రదించిన అధికారులు, పాలక వర్గాలకు తాను ప్రజలకు కనీస ఆదాయ పథకం గురించి ప్రతిపాదించానని, ఇది సరైన ఆలోచన అని వారికి చెప్పానని హింటన్ వివరించారు.

# 2024 మార్చి నెల లో మొత్తం 14.41 లక్షల మంది సభ్యుల ను చేర్చుకొన్న ఇపిఎఫ్ఒ

న్యూఢిల్లీ, 21:ఉద్యోగుల భవిష్య నిధి సంస్థ (ఇపిఎఫ్ఒ) 2024 మే నెల 20 వ తేదీ నాడు విడుదల చేసిన తాత్కాలిక పేరోల్ డేటా నుండి ఇపిఎఫ్ఒ 2024 మార్చి నెల లో మొత్తం 14.41 లక్షల మంది సభ్యులను చేర్చుకొందని వెల్లడి అయింది.

క్రొత్త గా సుమారు 7.47 లక్షల మంది సభ్యుల ను 2024 మార్చి నెల లో చేర్చుకొన్నట్లు ఈ డేటా సూచిస్తున్నది. అటువంటి వారిలో ఎక్కువ గా 18 ఏళ్ళు మొదలుకొని 25 ఏళ్ళ వయోవర్గానికి చెందిన వారే ఉన్నారు; వీరు 2024 మార్చి నెల లో చేర్చుకొన్న మొత్తం నూతన సభ్యుల లో 56.83 శాతం గా ఉన్నారు; అంతేకాక సంఘటిత రంగం యొక్క శ్రమ శక్తి లో చేరిన వ్యక్తుల లో చాలా వరకు యువత యే, మరీ ముఖ్యం గా ఒకటో సారి నౌకరి ని దక్కించుకొన్న వారు ఉన్నారు అనేటటువంటి అంశాన్ని కూడా ఇది తెలియజేస్తున్నది.పేరోల్ డేటా తో వెల్లడి అయిందేమిటంటే సుమారు 11.80 లక్షల మంది సభ్యులు ఇపిఎఫ్ఒ నుండి బయటకు వెళ్ళిపోయారని, ఆ తరువాత మళ్లీ ఇపిఎఫ్ఒ లో చేరిపోయారు అనేదే. ఈ సభ్యులు వారు చేస్తున్న కొలువు ను మార్చుకొన్నారు, ఇంకా ఇపిఎఫ్ఒ పరిధి లో ఉన్నటువంటి సంస్థల లో తిరిగి భర్తీ అయ్యారనీను. వారు తుది పరిష్కారానికై దరఖాస్తు పెట్టుకొనేందుకు బదులుగా వారి యొక్క ఖాతాల లో పోగు పడిన సొమ్ము ను బదలీ చేసుకొనే ఐచ్ఛికాన్ని ఎంపిక చేసుకొన్నారు; ఈ విధం గా దీర్ఘకాలిక ఆర్థిక శ్రేయం పదిలం గా ఉండే వారి యొక్క సామాజిక భద్రత విస్తరణ కు లోనైంది అన్న మాట.

పురుషులు, మహిళల వారి గా పేరోల్ డేటా విశ్లేషణ ను పట్టి చూస్తే, నూతనం గా భర్తీ అయిన 7.47 లక్షల మంది సభ్యుల లో దాదాపు గా రెండు లక్షల మంది క్రొత్త గా వచ్చి చేరినటువంటి మహిళా సభ్యులు ఉన్నారు అని తేలింది. దీనికి తోడు, ఆ నెల లో జత పడినటువంటి మొత్తం మహిళా సభ్యుల సంఖ్య దాదాపు గా 2.90 లక్షలు గా ఉంది. మహిళా సభ్యులు క్రొత్త గా అనుబంధితులు కావడం అనేది వారు వివిధ ఉద్యోగాల లో చేరిన సంగతి ని తెలియపరుస్తున్నది.

పరిశ్రమ వారీ డేటా ను ఏ నెల కు ఆ నెల పద్ధతి న పరిశీలించినపుడు, తయారీ, మార్కెటింగ్, సేవలు, కంప్యూటర్ ల వినియోగం, ఉపాహార శాల లు, చార్టర్డ్ అకౌంటెట్ లు లేదా రిజిస్టర్డ్ అకౌంటెంట్ లు, ఫిష్ ప్రాసెసింగ్ మరియు మాంసాహార సంరక్షణ, బీడీ ల తయారీ వగైరా కార్యకలాపాల లో నిమగ్నం అయిన సంస్థల లో పనిచేస్తున్న సభ్యులలో వృద్ధి ఉన్నట్లు బయటపడింది. మొత్తం శుద్ధ సభ్యత్వాల లో నుండి, దాదాపుగా 43 శాతం వృద్ధి నిపుణుల సేవ ల రంగాని కి చెందిన (మానవ శక్తి సరఫరాదారు సంస్థ లు, సాధారణ గుత్తేదారు లు, సెక్యూరిటీ సర్వీసు లు ఇతరేతర కార్యకలాపాల వంటి) వాటి నుండి కలసినవి ఉన్నాయి.

పైన ప్రస్తావించిన పేరోల్ డేటా తాత్కాలికమే. అలా ఎందుకంటే డేటా సృజన తనంతట తాను నిరంతరం కొనసాగుతూ ఉండేటటువంటి కసరత్తు. ఉద్యోగుల రికార్డు ను అప్‌డేట్ చేయడం అనేది ఎల్లప్పటికీ కొనసాగుతూ ఉండేటటువంటి ప్రక్రియ కదా. ఈ కారణం గా ఇదివరకటి డేటా ను ప్రతి నెల తాజా గా సవరించడం జరుగుతూ ఉంటుంది. 2018 వ సంవత్సరం ఏప్రిల్ నుండి, ఇపిఎఫ్ఒ 2017 సెప్టెంబరు తరువాతి కాలాన్ని కలుపుకొంటూ పేరోల్ డేటా ను విడుదల చేస్తూ వస్తున్నది. నెలవారీ పేరోల్ డేటా లో, ఆధార్ తో ప్రామాణీకరించిన యూనివర్సల్ అకౌంట్ నంబర్ (యుఎఎన్) మాధ్యం ద్వారా ఒకటోసారి ఇపిఎఫ్ఒ లో చేరిన సభ్యుల సంఖ్యల ను, ఇపిఎఫ్ఒ యొక్క కవరేజి పరిధి లో నుండి బయటకు వెళ్లిపోయిన వర్తమాన సభ్యులు మరియు దీనిలో నుండి నిష్క్రమించినప్పటికీ సభ్యులు గా తిరిగి చేరిన వారిని పరిశీలించి వారిని శుద్ధ నెలవారీ పే రోల్ లో చేర్చడమైంది.

# మట్టిపెళ్లలు మీదపడి ఉపాధి హామీ కూలి మృతి



రాజన్న సిరిసిల్ల, 21:(నేటినిజం ప్రతినిధి): రాజన్న సిరిసిల్ల జిల్లాలో ఉపాధి హామీ పనులు చేస్తుండగా మట్టిపెళ్లలు మీదపడి ఒకరు మృతి చెందారు. మరో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన కోనారావుపేట మండటం వెంకట్రావుపేటలో చోటు చేసుకుంది. ప్రమాదంలోమార్వాక రాజవ్వ (45) మృతి చెందగా కర్ణాల లహరి, పల్లం దేవవ్వ, కర్నాల శ్యామల, ఎడ్ల రామవ్వ, వద్నాల అమృత, సందు చంద్రయ్య గాయపడ్డారు. స్థానికులు క్షతగాత్రులను హుటాహుటిన జిల్లా హాస్పిటల్‌కు తరలించారు. కాగా, విషయం తెలుసుకున్న జడ్పీ చైర్ పర్సన్ జడ్పీ చైర్పర్సన్ న్యాలకొండ అరుణరాఘవ రెడ్డి హాస్పిటల్‌కు వెళ్లి క్షతగాత్రులను పరామర్శించారు. మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచించారు.

# కలిసి పోర్న్ చూశారు.. సోదరి ప్రెగ్నెంట్.. సోదరుడు అరెస్టు

ముంబై మే 21 (ఎక్స్ ప్రెస్ న్యూస్);: ఆ ఇద్దరూ కలిసి పోర్న్ చూశారు.. సోదరి ప్రెగ్నెంట్.. నవీ ముంబైలో పోలీసులు 13 ఏళ్ల కుర్రాడిని అరెస్టు చేశారు. ఐపీసీ, పోక్సో చట్టాల కింద అతన్ని అదుపులోకి తీసుకున్నారు. 15 ఏళ్ల సోదరి గర్భం దాల్చడానికి కారణమైన 13 ఏళ్ల పిల్లోడిని అరెస్టు చేశారు. తాను ప్రెగ్నెంట్ కావడానికి సోదరుడే కారణమని ఆ అమ్మాయి పోలీసులకు చెప్పింది. అయితే ఆ ఇద్దరూ కలిసి పోర్న్ చూడడం వల్లే ఇదంతా జరిగినట్లు తెలుస్తోంది. వాషి జనరల్ హాస్పిటల్ లో చికిత్స పొందుతున్నారు. డిసెంబర్ 2023లో అన్నాచెల్లెళ్లు ఇద్దరూ తొలిసారి సెక్స్‌లో పాల్గొనేందుకు ప్రయత్నించారని, కానీ ఆ ప్రయత్నంలో వాళ్లు విఫలమైనట్లు ఈ కేసును విచారిస్తున్నట్లు పోలీసు అధికారి వెల్లడించారు. అయితే ఈ ఏడాది జనవరిలో ఆ అమ్మాయి తన సోదర్ని రేప్ చేసినట్లు తెలుస్తోంది. బాధితురాలు తన నెలసరి తప్పడంతో ఈ విషయాన్ని తల్లికి చేరవేసినట్లు పోలీసులు వెల్లడించారు. ఖండేశ్వర్ పోలీసు స్టేషన్‌కు కేసును ట్రాన్స్‌ఫర్ చేశారు. మైనర్ బాలుడి విషయంలో ఏం చేయాలన్న అంశాన్ని చైల్డ్ వెల్ఫేర్ కమిషన్ చూసుకుంటుందన్నారు. ఐపీసీలోని 376, 376(2) సెక్షన్ల కింద పిల్లోడిపై కేసు బుక్ చేశారు. పోక్సో చట్టంలోని 4,6,8,12 సెక్షన్ల కింద కూడా కేసు నమోదు చేశారు.

# టీడీపీ అధినేత చంద్రబాబు ఎక్కడికి వెళ్లారు..ఎందుకు వెళ్ళాడు..

## -మంత్రి జోగి రమేశ్ అనుమానం

అమరావతి మే 21 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );: టీడీపీ అధినేత చంద్రబాబు ఎక్కడికి వెళ్లారు.. ఏమైపోయారని ఏపీ మంత్రి జోగి రమేశ్ ప్రశ్నించారు. తమ నాయకుడు జగన్ ఎక్కడికి వెళు_న్నారో చెప్పి వెళ్లారని.. మరి ప్రతిపక్ష నాయకుడు ఎక్కడికి వెళ్లారో ప్రజలకు తెలియజేయాలని అన్నారు. దోచుకున్న డబ్బును దాచుకోవడానికి దుబాయికి వెళ్లారా? అని అనుమానం వ్యక్తం చేశారు. దుబాయి వెళ్లారా? ఇటలీ వెళ్లారా? అమెరికా వెళ్లారా? అని ప్రశ్నించారు. జూన్ 4వ తేదీన కూటమిని ప్రజలు సమాధి చేస్తారని.. త్వరలోనే టీడీపీ అడ్రస్ గల్లంతు అవుతుందని విమర్శించారు. టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు ఆరిపోయే దీపం లాంటి వారని, ఏపీలో టీడీపీ అడ్రస్ గల్లంతు కావడం ఖాయమని మంత్రి జోగి రమేష్ అన్నారు. వైసీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కూటమి నాయకులపై విరుచుకుపడ్డారు. విశ్వాసనీయత, విలువలు ఒకవైపు, కుట్రలు, కుతంత్రాలతో జరిగిన ఎన్నికల్లో ప్రజలు విశ్వాసనీయతపై మొగు చూపారని వెల్లడించారు. ఎన్నికల్లో కూటమి నాయకులు ఎన్నికుట్రలు పన్నినా , శాంతి భద్రతలకు విఘాతం కలిగించినా కూడా ప్రజల ఆశీస్సులతో గెలువబోతున్నామని జోస్యం చెప్పారు. జగన్ మరోసారి ముఖ్యమంత్రిగా ప్రమాణం చేయనున్నారని జాతీయ సర్వే సంస్థలన్నీ వెల్లడిస్తున్నాయని అన్నారు. ఎన్నికల్లో వైసీపీ మంత్రులు, నాయకులు, కార్యకర్తలపై కేసులు పెట్టించినా కూడా ఏపీలో వైఎస్సార్ జెండా రెపరెపలాడ బోతుందని, శ్రేణులు సంబురాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. పల్నాడులో శాంతి భద్రతలను ఖూనీ చేసింది టీడీపీయేనని, ప్రజలను రెచ్చగొట్టింది చంద్రబాబేనని ఆరోపించారు. జూన్ 4న వెలువడే ఫలితాల తరువాత కూటమికి సమాధి తప్పదని అన్నారు. ఇప్పటికే కూటమి అధినేత చంద్రబాబు (అష్త్రజీనిటతీజీ ఃజీఎబీ) పారిపోగా, దత్తపుత్రుడు ఏమయ్యాడో తెలియదని, బీజేపీ నాయకులు కనిపించకుండా పోయారని విమర్శించారు.

# సిట్ నివేదికపై చీఫ్ సెక్రటరి జవహర్‌రెడ్డితో డీజీపీతో భేటి




అమరావతి మే 21 (ఎక్స్ ప్రెస్ న్యూ స్); : ఏపీలో పోలింగ్ రోజు, తరువాత మూడు జిల్లాలో జరిగిన హింసాత్మక ఘటనలపై సిట్ ఇచ్చిన నివేదికపై రాష్ట్ర డీజీపీ హరీష్‌కుమార్ గుప్తా రాష్ట్ర చీఫ్ సెక్రటరి జవహర్‌రెడ్డితో భేటి అయ్యారు. మంగళవారం సీఎస్ కార్యాలయంలోకి వెళ్లిన డీజీపీ దాదాపు గంటపాటు సీఎస్‌తో పలు అంశాలపై చర్చిందారు. అనంతపురం, తిరుపతి, పల్నాడు జిల్లాలో అల్లరు, విధ్వంసక ఘటనలు, అభ్యర్థులపై దాడుల ఘటనలపై కేంద్ర ఎన్నికల సంఘం తీవ్రంగా పరిగణించింది . వెంటనే సిట్‌ను ఏర్పాటు చేసి విచారణ జరిపి నివేదికను సీఎస్‌కు, డీజీపీకి, కేంద్ర ఎన్నికల సంఘానికి పంపాలని ఆదేశించింది. సిట్ కు నాయకత్వం వహిస్తున్న బ్రిజ్‌లాల్ తన 12 మంది సభ్యులతో రెండురోజుల పాటు అల్లర్లు జరిగిన ప్రాంతాన్ని పరిశీలించడం పాటు బాధితులను, క్షతగాత్రులను, పోలీసులను, ఎన్నికల అధికారులను కలిసి విచారణ చేపట్టింది. అనంతరం సోమవారం 150 పేజీలతో కూడిన నివేదికను డీజీపీకి అందజేసింది. ఈ రిపోర్టు ఆధారంగా కౌంటింగ్ కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తు, అల్లర్లు జరుగడానికి అవకాశముండే ప్రాంతాలను గుర్తించి అక్కడ తీసుకోవాల్సిన భద్రత చర్యల గురించి ఇద్దరూ అధికారులు చర్చించినట్లు సమాచారం. అదేవిధంగా విధ్వంసకాండలో పోలీసుల పాత్ర, వారిపై శాఖాపరంగా తీసుకోవాల్సిన చర్యల గురించి చర్చకు వచ్చినట్లు తెలిసింది . మూడు జిల్లాలో శాంతి భద్రతలను అదుపులోకి తీసుకువచ్చేందుకు ఇప్పటికే కేంద్రం నుంచి అదనపు బలగాలను రాష్ట్రానికి రప్పించిన విషయం తెలిసిందే.

# రైతులను మోసం చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం : ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి




జనగామ, మే 21 : అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లో రైతు రుణమాఫీ చేస్తామని, పండిన పంటలకు రూ.500 బోనస్ ఇస్తామని కాంగ్రెస్ పార్టీరైతులను మోసం చేసిందని జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి ఆరోపించారు. మంగళవారం ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్ వద్ద మీడియాతో మాట్లాడారు. 2014లో జనగామ జిల్లాలో తెలంగాణ రాక ముందు పండిన వరి పంట, కేసీఆర్ ప్రభుత్వం వచ్చాక మూడు రెట్లు పెరిగిందన్నారు.

తెలంగాణలో గతంలో ఒక పంట పండేది, కానీ రాష్ట్రం ఏర్పడ్డాక రెండు పంటలు పండేలా కేసీఆర్ చేసిన కృషి ఎంతో ఉందని కొనియాడారు. నిన్న క్యాబినెట్ మీటింగ్‌లో రైతులకు నిరాశే ఎదురైందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వస్తే డిసెంబర్ 09న రూ.2 లక్షల రుణమాఫీ అవుతుందని రైతులు సంతోషపడ్డారని, కానీ అది అమలు కాలేదన్నారు.

ఆ తర్వాత 100 రోజుల్లో చేస్తామని మోసం చేశారన్నారు. ఇప్పుడు మళ్లీ ఆగస్ట అని హామీలిస్తున్నారని మండిపడ్డారు. రైతులను మోసం చేస్తున్న ఈ ప్రభుత్వానికి బుద్ధి చెప్పేందుకు రైతుల పిల్లలైన పట్టభద్రులు ఆలోచించి ఓటేయాలన్నారు. ఈ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్ఎస్‌అభ్యర్థి రాకేశ్‌రెడ్డికి ఓటు వేయాలని పిలుపునిచ్చారు.




# ఇక ఏ వన్ పెద్దిరెడ్డే..!? ఎఫ్ ఐ ఆర్ భయం..

అమరావతి, మే 21 :ఏపీలో వైనాట్ 175 స్లోగన్ ..మోత ఆగింది. కానీ విజయం మాత్రం వైసీపీదే.. 151 మార్కు దాటుతుందని సొంత సర్వేలు సోషల్ మీడియాలో హల్ చల్ చేస్తున్నా.. నిన్నటి వరకూ ఫైర్ బ్రాండ్ ఇమేజీతో ఘర్జించిన నేతలందరూ? మౌన దీక్షను బూనారు. కౌంటింగ్ కౌంట్ డౌన్ ముగిసే వరకూ కొందరు విదేశీయానంలో కాలక్షేపం చేస్తుంటే? మరి కొందరు అగ్రనేతలను ఎఫ్ ఐఆర్ భూతం వెంటాడుతోంది. వీరిలో పెద్దాయన పెద్దిరెడ్డి పేరు మార్మోగుతోంది. ఒకవేళ వైసీపీ అధికారంలోకి రాకపోతే? కూటమి గెలిస్తే తొలి ప్రధాన నిందితుడిగా పెద్దిరెడ్డి పేరిట ఎఫ్ ఐఆర్ ప్రత్యక్షం కావటం తథ్యమమని ప్రచారం తెరమీదకు వచ్చింది.

పెద్దిరెడ్డి హావభావాలు? ఆహం భావ స్వరమే.. ఈ చర్చకు దారి తీసింది. చంద్రబాబు నాయుడితోపాటు తెలుగుదేశం పార్టీ నేతలను వేధించడంలో పెద్దిరెడ్డి ముందుం డేవారు. చిత్తూరు జిల్లా అంగళ్లులో బాబుపై హత్యాయత్నం స్థాయిలో అల్లరి మూకలు చెలరేగిపోయాయి. వాటివెనక పెద్దిరెడ్డి ఉన్నారనేది బహిరంగ రహస్యం. కుప్పంలో చంద్రబాబును ఓడించడానికి పావులు కదిపారు. హిందూపురం నుంచి బాలకృష్ణను వెళ్లగొడతానన్నారు. వందల సంఖ్యలో టీడీపీ కార్యకర్తలపై కేసులు పెట్టించారు. ఇక ప్రభుత్వం మారితే? టార్గెట్ అయ్యేది కూడా పెద్దిరెడ్డే. పోలింగ్ కు ముందే పెద్దిరెడ్డితోపాటు ఆయన కుమారుడు మిథున్ రెడ్డి కూడా సైలెంట్ అయ్యారు.

వైసీపీ ప్రభుత్వ హయాంలో పెద్దిరెడ్డి వ్యవహరించిన తీరుతో ప్రభుత్వం మారిన తర్వాత ఆయన వ్యాపారాలన్నీ మూతపడటం ఖాయమని రాజకీయ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. లొసుగులతో నిండిన వ్యాపారాలు కావడంతో ప్రభుత్వం మారితే కచ్చితంగా టార్గెట్ అవుతానని పెద్దిరెడ్డి కూడా భావించినట్లున్నారు. ఎన్నికల ప్రచారానికి వచ్చిన ప్రధాన మంత్రి నరేంద్రమోడీ పీలేరులో మంత్రి పెద్దిరెడ్డి మాఫియా గురించి ప్రత్యేకంగా ప్రస్తావించడం గమనార్హం.

# కాంగ్రెస్ పార్టీవి అన్నీ బోగస్ మాటలే..

## – ప్రజలను దగా చేయడమే వారికి వెన్నతో పెట్టిన విద్య
## –రాజకీయ మనుగడ కోసం తెలంగాణ సెంటిమెంటుతో మోసం చేస్తున్న బిఆర్ఎస్,కాంగ్రెస్
## –తెలంగాణా బిల్లుకు బిజెపి సంపూర్ణ మద్దతు ఇవ్వడం వల్లే రాష్ట్రం సాకారమైంది
## –బిజెపి తెలంగాణ రాష్ట్ర అధికార ప్రతినిధి, మీడియా ఇంచార్జ్ ఎన్వీ సుభాష్

హైదరాబాద్ మే 21 (ఎక్స్ ప్రెస్ న్యూ స్); కాంగ్రెస్ పార్టీవి అన్నీ బోగస్ మాటలేనని, ప్రజలను దగా చేయడమే వారికి వెన్నతో పెట్టిన విద్య అని బిజెపి తెలంగాణ రాష్ట్ర అధికార ప్రతినిధి, మీడియా ఇంచార్జ్ ఎన్వీ సుభాష్ విమర్శించారు. ఎన్నికల ముందు రైతులు ఎంత ధాన్యం పండించినా వరిపంటకు రూ.500 బోనస్ ఇస్తామన్నరు.. ఇప్పుడు సన్న వడ్లకు మాత్రమే దగా చేస్తున్నరు. రాష్ట్రంలో దొడ్డ వడ్లు పండించే మెజార్టీ రైతులకు మొండిచెయ్యి చూపించారు. కష్టించి పండించిన ధాన్యాన్ని కొనకుండా అకాల వర్షాలపాలు చేసింది అసమర్థ కాంగ్రెస్ ప్రభుత్వమని దుయ్యబట్టారు. కొనుగోలు కేంద్రాలు లేక ఇబ్బందులు పడుతుంటే ఒక్క సమీక్ష సమావేశం నిర్వహించలే.. రైతుల సమస్యలు తెలుసుకోలేప్రతి ఏటా రైతులు, కౌలు రైతులకు రూ.15 వేలు రైతుభరోసా అన్నారు.. ఇవ్వలేదు. వ్యవసాయ కూలీలకు రూ.12 వేలు అన్నారు.. ఇచ్చింది లేదు. ప్రతి రైతుకు డిసెంబర్ 9నే రూ.2 లక్షల రుణమాఫీ అన్నారు.. ఆగస్టు పేరుతో పంగనామం పెట్టాలని చూస్తున్నరు. నిన్నటి కేబినెట్ మీటింగ్ లో జూన్ 2న తెలంగాణ ఆవిర్భావ దినోత్సవాలను (దశాబ్ధి ఉత్సవాలు) నిర్వహించేందుకు సోనియా గాంధీని ఆహ్వానిస్తామని ప్రకటించారు. కాంగ్రెస్ నిర్వహించేది దశాబ్ధి ఉత్సవాలా..? దశ దిశ లేని కాంగ్రెస్ పార్టీ పాలన వైఫల్యాలను కప్పిపుచ్చుకునే ఉత్సవాలా..? చెప్పాలి. అసలు సోనియా గాంధీ గారిని ఏ హోదాలో ఆహ్వానిస్తున్నారో తెలంగాణ ప్రజలకు సమాధానం చెప్పాలని సుబాష్ డిమాండ్ చేసారు..సబ్బండ వర్గాల పోరాటంతోనే తెలంగాణ ఉద్యమం సాకారమైంది. కాని, ఉద్యమాన్ని ఎప్పటికప్పుడు తమ ఖాతాలో వేసుకుంటూ బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు రాజకీయ క్రీడ ఆడుతుంటటం సిగ్గుచేటు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం దశాబ్ధి ఉత్సవాల పేరుతో ప్రజాధనాన్ని దుర్వినియోగం చేసిందని, దశాబ్ధి సంబురాల పేరుతో సుమారు రూ.500కోట్లకు పైగా ప్రజాసొమ్మును వెచ్చించిందన్నారు..గత ప్రభుత్వంలో పేదలకు డబల్‌బుడ్‌రూం ఇళ్లు రాలేదు, పంటలకు గిట్టుబాటు ధర రాలేదు, ఆసరా పింఛన్లు అందలేదు.. దళితబంధు ఇయ్యలేదు.. నిరుద్యోగ భృతి దక్కలేదు. కేసీఆర్ బంగారు తెలంగాణ పేరుతో ప్రజలు బతకలేని తెలంగాణగా మార్చారు. నాడు రాష్ట్రంలో ప్రజలు ఇబ్బందుల్లో చిక్కుకుంటే.. తెలంగాణ దశాబ్ధి ఉత్సవాల పేరుతో పార్టీ ప్రమోషన్లకు ప్రజల సొమ్మును దారిమళ్లించారని ఆరోపించారు..ఇప్పుడు అదే బీఆర్ఎస్ పంథాలో కాంగ్రెస్ ప్రభుత్వం దశాబ్ధి ఉత్సవాలంటూ మరో ప్రమోషన్ కు సిద్ధమయ్యారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కోసం బిజెపి మొదటి నుంచి మద్దతిస్తూనే వచ్చింది. 2009లో బిజెపి అధికారంలోకి వస్తే వందరోజుల్లో తెలంగాణ ఏర్పాటు చేస్తామని అద్వాణీ స్పష్టంగా ప్రకటించారు. 2012లో నాటి ఉమ్మడి రాష్ట్రంలో మా పార్టీ అధ్యక్షులు కిషన్ రెడ్డి తెలంగాణ పోరు యాత్రతో ప్రజల్లో చైతన్యం నింపారు. ఢిల్లీలో జంతర్ మంతర్ వద్ద పోరుదీక్ష చేశారు. ముఖ్యంగా 2014లో తెలంగాణ బిల్లు పార్లమెంటులో ప్రవేశపెట్టినప్పుడు బిజెపి బిల్లుకు సంపూర్ణ మద్దతు ఇవ్వడం వల్లే తెలంగాణ రాష్ట్రం సాకారమైంది. లోక్ సభలో బిల్లు ఆమోదం వేళ దివంగత సుష్మాస్వరాజ్ , అరుణ్ జైట్లీ ప్రధానపాత్ర పోషించారు. కాని, తెలంగాణ తెచ్చింది ఒకరని, రాష్ట్రాన్ని ఇచ్చింది ఒక పార్టీ అని ప్రజలను మభ్యపెట్టి.. బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు తమ విలాసాల కోసం, తమ రాజకీయ మనుగడ కోసం తెలంగాణ ప్రజల సెంటిమెంటుతో ఆటలాడుకోవడం దురదృష్టకరం. ఎన్నికలప్పుడు ఇచ్చిన గ్యారంటీలు, హామీలు ఏ ఒక్కటీ నెరవేర్చకుండా.. రైతులను క్షోభ పెడుతూ, ప్రజలను ఇబ్బందులు పెడుతూ మళ్లీ దశాబ్ధి ఉత్సవాల పేరుతో ప్రజలను మభ్యపెట్టాలనుకోవడం సరికాదు. పోరాటాలు, నిరసనలు, ధర్నాలు, ఉద్యమాలతో సాకారం చేసుకున్న తెలంగాణ రాష్ట్రం అవతరణ దినోత్సవాలకు బిజెపి ఎప్పుడూ వ్యతిరేకం కాదు. కాని, ప్రజల సమస్యలు తీర్చకుండా, ప్రజాధనాన్ని దుర్వినియోగం చేయాలనుకుంటున్న కాంగ్రెస్ పార్టీ వైఖరిని తీవ్రంగా ఖండిస్తున్నాం. కేవలం స్వార్థపూరిత రాజకీయాల కోసం ప్రజలను సెంటిమెంట్ అస్త్రంగా వాడుకోవాలనుకోవడాన్ని వ్యతిరేకిస్తున్నాం. ముందు ప్రజల సమస్యలు తీర్చి.. సంబురాలకు వెళ్లాలని కాంగ్రెస్ పార్టీని డిమాండ్ చేస్తున్నాం.

# పత్తి విత్తనం .. బంగారమాయే! మార్కెట్లో డీలర్ల మాయాజాలం

అదిలాబాద్, మే 1 : తెల్ల బంగారం పండించే పత్తి రైతన్న విత్తనాలు దొరక్క నల్ల బజారులో మోసపోతున్నాడు. కంపెనీలు, డీలర్ల మాయాజాలంలో చిక్కి విత్తనాల కొనుగోలు దశలోనే దుకాణాల ముందు పడిగాపులతో పడరాని పాట్లు పడుతున్నాడు. మార్కెట్లో డిమాండ్ ఉన్న పత్తి విత్తనాలను బడా వ్యాపారులు కృత్రిమ కొరత సృష్టించినా అధికారులు చేష్టలుడిగి చోద్యం చూస్తున్నారు. అహరహరం శ్రమించి తెల్ల బంగారం పండించిన రైతులు మొన్నటి వరకు మార్కెట్లో ధర లేక అవస్థలు పడితే? ఇప్పుడు విత్తనాలు దొరక్క దిక్కుతోచని పరిస్థితిని



ఎదుర్కొంటున్నారు.

తొలకరికి ముందే రోడ్డెక్కిన రైతులు..

తెలంగాణలోని అత్యధికంగా ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లాలో 14.40 లక్షల ఎకరాల్లో వర్షాధారంపైనే రైతులు పత్తి పంట సాగు చేస్తున్నారు. పత్తి విత్తనాల మార్కెట్ తో వేల కోట్ల వ్యాపారం చేసే పత్తి డీలర్లు, ఆయా కంపెనీలు రైతుల బలహీనతలను ఆసరాగా చేసుకొని డిమాండ్ ఉన్న పత్తి విత్తనాలను కృత్రిమ కొరత సృష్టిస్తోంది. దుక్కి దున్ని భూములు చదును చేసుకుని ఉత్సాహంగా రైతులు విత్తనాల కోసం వెళితే.. మార్కెట్లో నో స్టాక్ బోర్డులు చూసి నిరాశకు లోనవుతున్నారు. ఒక ఎకరానికి రెండు బ్యాగులు అవసరమయ్యే పత్తి విత్తన బ్యాగులు దొరక్క అవస్థలు పడుతున్నారు. ఆదిలాబాద్ జిల్లాలో లైసెన్సు కలిగిన 1462 విత్తన దుకాణాలు ఉన్నాయి. రాశి- 659 రకం పత్తి వంగడం సాగు చేసిన రైతులు ఆశాజనకంగా దిగుబడులు సాధించారు. ఈసారి అదే కంపెనీ విత్తనాలు కావాలని ఎగబడడంతో వారి అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకుని డీలర్లు విత్తనాల కొరత ఉందంటూ ప్రత్యామ్నాయ విత్తనాలు అంటగడుతున్నారు.

గతంలో నకిలీ విత్తనాలతో మోసం..

గతంలో ఆర్భాట ప్రచారానికి మోసపోయి అవే కంపెనీల విత్తనాలు సాగు చేసి నకిలీ విత్తనాలతో తీవ్రంగా నష్టపోవాల్సి వచ్చింది. ఈసారి నూటికి 80 శాతం మంది రైతులు రాశి 659కంపెనీ పత్తి విత్తనాలు కావాలని డిమాండ్ చేస్తుండగా మార్కెట్లో దొరకని పరిస్థితి. ఆదిలాబాద్ జిల్లాలోనే 10 లక్షల 50 వేల విత్తనాల బ్యాగులు అవసరమని అధికారులు గుర్తించగా, కేవలం 1,35,000 బ్యాగులు మాత్రమే అందుబాటులో ఉన్నాయని బుకాయిస్తున్నారు. తమ జీవితాలతో ముడిపడి ఉన్న పత్తి విత్తనాల కొనుగోళ్లలో అధికార యంత్రాంగం నిర్లక్ష్యంగా వ్యవహరించడం పై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. బడా రైతులు పెద్ద మొత్తంలో పత్తి విత్తనాల బ్యాగులను కృత్రిమ కొరత సృష్టించి ఆ తర్వాత తొలకరి వానలు పడగానే రైతులకు ఐదు రేట్లు అధికంగా ధర వసూలు చేసి అంటగట్టే అవకాశం పొంచి ఉంది. మంగళవారం ఆదిలాబాద్ మార్కెట్లో రైతులు రాశి విత్తనాల కోసం రోడ్డెక్కి నిరసన చేయాల్సి వచ్చింది.

సీడ్ ప్రాసెసింగ్ లో ఆలస్యం..

పత్తి విత్తన కంపెనీలు సీడ్ ప్రాసెసింగ్, జెర్మినేషన్ పరీక్షలు, ఆ తర్వాత విత్తన శుద్ధి, ప్యాకింగ్, సర్కారు అనుమతి తదితర విధివిధానాలు పాటించాల్సి ఉంటుంది. ఇవన్నీ పూర్తి చేసిన తర్వాతే విత్తనాలు బయట మార్కెట్లోకి ప్రవేశిస్తాయి. నైరుతి రుతుపవనాలు ముందస్తుగా రావడంతో రైతులు ఉరుకులు పరుగులు తీస్తున్నారు. జూన్ రెండవ వారం వరకు రైతులు ఓపిక పడితేనే మంచిది. రెండో వారంలోనే భూమిలో తేమశాతాన్ని బట్టి విత్తనాలు విత్తు కోవాలి. పత్తి విత్తనాల కొరతపై జిల్లా కలెక్టర్ తో సంప్రదించి నియంత్రణ చర్యలు చేపడుతాం. రైతులు సర్టిఫై చేసిన ప్రత్యామ్నాయ విత్తనాలను కూడా కొనుగోలు చేస్తే మంచిది.

# డీజీపీ రవిగుప్తా ఫొటో పెట్టి కేటుగాళ్లు మోసాలు

హైదరాబాద్ మే 21 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );: తెలంగాణ డీజీపీ ఫొటోతో కేటుగాళ్లు సైబర్ నేరాలకు పాల్పడుతన్నారు. వాట్సప్ డీపీగా డీజీపీ రవిగుప్తా ఫొటో పెట్టి మోసాలు చేస్తున్నారు. ఈ క్రమంలో ఓ వ్యాపారవేత్తకు, ఆయన కుమార్తెకు వాట్సప్ కాల్స్ చేసి బెదిరింపులకు పాల్పడ్డారు. డ్రగ్స్ కేసులో అరెస్టు చేస్తామని తెలిపారు. కేసు నుంచి తప్పించుకునేందుకు రూ. 50 వేలు డిమాండ్ చేశారు. దీంతో అనుమానం వచ్చిన వ్యాపారవేత్త సీపీఎస్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై దర్యాప్తు చేపట్టిన పోలీసులు పాకిస్తాన్ కోడ్ +92తో వాట్సప్ కాల్ వచ్చినట్లు గుర్తించారు.

# వికసిత్ భారత్ సాకారం కావాలంటే ఆ మూడు రాష్ట్రాల అభివృద్ధి కీలకం : నిర్మలా సీతారామన్

న్యూఢిల్లీ, 21 :తూర్పు రాష్ట్రాల అభివృద్ధికి ఎన్డీయే నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత ఇస్తుందని కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ వెల్లడించారు. లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా సోమవారం ఆమె పట్నాలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు.

2047 నాటికి భారత్‌ను అభివృద్ధి చెందిన దేశంగా మలిచే క్రమంలో బిహార్, పశ్చిమ బెంగాల్, ఒడిషా వంటి తూర్పు రాష్ట్రాలను దేశానికి వృద్ధి కేంద్రాలుగా మార్చాలని కేంద్రం యోచిస్తోందని చెప్పారు. 2005కు ముందు ఆటవిక పాలనతో బిహార్ వృద్ధి దారుణంగా దెబ్బతిన్నదని నిర్మలా సీతారామన్ అన్నారు.

1991లో బిహార్‌లో తలసరి ఆదాయం రూ. 21,282 కాగా, జంగిల్ రాజ్ హయాంలో అది 33 శాతం పతనమై రూ. 14,209కి పడిపోయిందని వివరించారు. 2019 నాటికి బిహార్ తలసరి ఆదాయం ఏటా 5 శాతం వృద్ధితో రూ. 37,000కు చేరిందని చెప్పారు. జంగిల్ రాజ్‌లో దుష్పరిపాలన లేకుండా పాలన సజావుగా ఉంటే బిహార్ తలసరి ఆదాయం 2019 నాటికి రూ. 95,330కి చేరిఉండేదని మంత్రి పేర్కొన్నారు.

# ప్రజలతో ఛీకొట్టించుకున్న ఏకైక సీఎం రేవంత్ రెడ్డి.. ఈటల రాజేందర్ సంచలన వ్యాఖ్యలు

హైదరాబాద్, 21 : సీఎం రేవంత్ రెడ్డిపై బీజేపీ నేత ఈటల రాజేందర్ సంచలన వ్యాఖ్యలు చేశారు. ప్రజలతో ఛీకొట్టించుకున్న ఏకైక ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అని విమర్శించారు. వరంగల్‌లో మంగళవారం నిర్వహించిన ఓ కార్యక్రమంలో ఈటల రాజేందర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఈటల మాట్లాడుతూ.. అతి తక్కువ సమయంలోనే కాంగ్రెస్ ప్రభుత్వం ఎక్కువ అక్రమ డబ్బులు వసూలు చేసిందని విమర్శించారు. ప్రధాని మోదీ, హోం మంత్రి అమిత్‌షానే స్వయంగా ఆర్ఆర్ ట్యాక్స్ గురించి చెప్పారంటే.. రాష్ట్రంలో ఏం జరుగుతుందో అర్థం చేసుకోవాలని ప్రజలకు సూచించారు.

కాంగ్రెస్ వాళ్లు ఆవురావురుమన్నట్లుగా ఉన్నారని ఈటల రాజేందర్ అన్నారు. ఎప్పటివరకు అధికారంలో ఉంటామో తెలీదని.. వీలైనంత తొందరగా అంతా సర్దుకుని పెట్టుకుంటున్నారని విమర్శించారు. హైదరాబాద్‌లో బిల్డింగ్ పర్మిషన్ కావాలంటే కాంగ్రెస్ వాళ్లకు సపరేట్ ఫీజు కట్టాల్సి వస్తుందని.. లేదంటే పర్మిషన్లు ఇవ్వడం లేదని ఆరోపించారు. ప్రజలు భిక్ష పెడితే రేవంత్‌రెడ్డికి సీఎం పదవి వచ్చిందని తెలిపారు. ప్రజలు దెబ్బకొడితే కాలగర్భంలో కలిసిపోవడం ఖాయమని స్పష్టంచేశారు.

# బ్రహ్మోత్సవాల్లో హనుమంత వాహనంపై దర్శనమిచ్చిన గోవిందరాజస్వామి



తిరుపతి, 21 :తిరుపతి గోవిందరాజస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం గోవిందరాజస్వామి హనుమంత వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా ఆలయ మాడ వీధుల్లో నిర్వహించిన ఊరేగింపు భక్తజన బృందాల చెక్కభజనలు, కోలాటాలు, మంగళవాయిద్యాల నడుమ అత్యంత వైభవంగా జరిగింది.

బుద్ధి, బలము, యశస్సు, ధైర్యం, నిర్భయత్వం, ఆరోగ్యం, అజాడ్యం, వక్తృత్వం హనుమంతుని స్మరిస్తే లభిస్తాయని, శరణాగతికి ప్రతీకగా స్వామివారు హనుమంత వాహనంపై ఊరేగారని అర్చకులు తెలిపారు. అనంతరం స్వామి, అమ్మవార్లకు స్నపన తిరుమంజనాన్ని నిర్వహించి పాలు, పెరుగు, తేనె, చందనం, కొబ్బరినీళ్లతో అభిషేకం చేశారు. వాహన సేవలో తిరుమల పెద్దజీయర్ స్వామి, చిన్నజీయర్‌స్వామి, ఆగమ సలహాదారులు సీతారామాచార్యులు, మోహన రంగాచార్యులు, ఆలయ డిప్యూటీ ఈవో శాంతి సూపరింటెండెంట్ నారాయణ, విశేష సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

తిరుమలలో పెరిగిన భక్తుల రద్దీ

స్వామివారిని దర్శించుకునేందుకు వచ్చిన భక్తులతో తిరుమల ప్రాంతం రద్దీగా మారింది . వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో కంపార్టుమెంట్లు నిండిపోగా ఏటీసీ అతిథిగృహం వరకు క్యూలైన్లో నిలబడ్డారు. టోకెన్లు లేని భక్తులకు 15 గంటల్లో సర్వదర్శనం కలుగుతుందని టీటీడీ అధికారులు తెలిపారు. నిన్న స్వామివారిని 85,825 మంది భక్తులు దర్శించుకోగా 36,146 మంది తలనీలాలు సమర్పించుకున్నారు. భక్తులు సమర్పించుకున్న కానుకల ద్వారా హుండీ ఆదాయం రూ. 4.40 కోట్లు ఆదాయం వచ్చిందని వివరించారు.

# నకిలీ విత్తనాలను అరికట్టేందుకు జిల్లా వ్యాప్తంగా ప్రత్యేక నిఘా

## - నకిలీ విత్తనాలను విక్రయిస్తూ పట్టుబడితే కఠిన చర్యలు: జిల్లా ఎస్పీ రోహిత్ రాజు




భద్రాద్రికొత్తగూడెం, మే 21 (నేటినిజం ప్రతినిధి) : అమాయక రైతులను మోసం చేస్తూ అక్రమార్జనే ధ్యేయంగా కొంతమంది అక్రమార్కులు నకిలీ విత్తనాలను విక్రయిస్తున్నారు. కొన్ని కంపెనీలు కాలం చెల్లిన విత్తనాలను రీసైక్లింగ్ చేసి కొత్త విత్తనాలు అని చెప్పి రైతులకు అమ్మడం ద్వారా సరైన దిగుబడి రాక రైతులు పెద్ద సంఖ్యలో నష్టపోతున్నారు. రైతులు నకిలీ విత్తనాల ముఠాల బారిన పడకుండా జిల్లా వ్యాప్తంగా వ్యవసాయాధికారులతో కలిసి సమన్వయం పాటిస్తూ ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయడం జరిగిందని జిల్లా ఎస్పీ రోహిత్ రాజు మంగళవారం ఒక ప్రకటనలో వెల్లడించారు. జిల్లా వ్యాప్తంగా అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలోని విత్తన దుకాణాలలో తనిఖీలు చేపట్టే విధంగా పోలీసు అధికారులకు ఆదేశాలను జారీ చేయడం జరిగిందని తెలియజేశారు. రైతులకు మేలు రకం విత్తనాలు విక్రయించే విధంగా చేసి నకిలీ, కల్తీ విత్తనాలను సరఫరా చేసే వారిపై ఉక్కుపాదం మోపాలని రాష్ట్ర ప్రభుత్వం, డీజీపీ ఆదేశాల మేరకు నకిలీ విత్తనాలను అరికట్టేందుకు జిల్లా వ్యాప్తంగా అధికారులు అప్రమత్తతో సమాచారాన్ని సేకరించి కఠినంగా వ్యవహరించడం జరుగుతుందని తెలిపారు. వానాకాలం సాగు చేసేందుకు రైతులు సన్నద్ధమవుతున్న సమయంలో నకిలీ విత్తనాలను విక్రయించేందుకు కొందరు వ్యక్తులు ప్రయత్నాలు చేస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని, వారిని అరికట్టడంలో భాగంగా జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలోని విత్తనాలు దుకాణాల యజమానులకు పలు సూచనలు చేయడం జరుగుతుందని తెలిపారు. నకిలీ విత్తనాలను సరఫరా చేసే వారిని గుర్తించి వారిపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి సమాచారం సేకరించి వారిపై కఠినంగా చట్టప్రకారం చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. లైసెన్స్ లు లేకుండా దుకాణాలను నడిపినా, రికార్డులను సరైన పద్ధతిలో మెయింటైన్ చేయకపోయినా, నకిలీ విత్తనాలను విక్రయించినా యజమానులపై కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని పోలీస్ అధికారులకు ఆదేశాల జారీ చేయడం జరిగిందని తెలియజేశారు. రైతులకు నాణ్యమైన విత్తనాలు అందేలా ప్రభుత్వ అనుమతి పొందిన సంస్థల నుంచి విత్తనాలను వినియోగించేలా ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో రైతులకు అవగాహనా కార్యక్రమాలను ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు. నకిలీ విత్తనాలు ఇతర ప్రాంతాల నుండి జిల్లాకు రవాణా కాకుండా సరిహద్దు ప్రాంతాల్లో చెక్ పోస్ట్ లు ఏర్పాటు చేసి నిఘా ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. అక్రమ రవాణాను జరిగే ప్రాంతాలు, మార్గాలను గుర్తించి ఆకస్మిక తనిఖీలు చేయడం, మొబైల్ చెక్ పోస్టులు ఏర్పాటు చేయడంతోపాటు నకిలీ, కల్తీ విత్తనాల అక్రమ రవాణాను, సరఫరాను అరికట్టడం జరుగుతుందని తెలిపారు.

# ఫలితాలు చూసి వైసీపీకి ఆ రోజు పెద్ద కర్మ నిర్వహించాల్సి ఉంటుంది

## - జగన్‌కు రిటర్న్ గిఫ్ట్ ఉంటుంది.. రఘురామ కృష్ణరాజు

విజయనగరం మే 21 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );: ఆంధ్రప్రదేశ్‌లో వైసీపీకి కౌంట్ డౌన్ స్టార్ట్ అయ్యిందని తెలుగుదేశం పార్టీ నేత, ఉండి టీడీపీ అభ్యర్థి రఘురామ కృష్ణరాజు సంచలన ఆరోపణలు చేశారు. ఈ నెల 13వ తేదీన వైసీపీకి ప్రజలు తిరస్కరించారని వివరించారు. ఒకవిధంగా ఆ పార్టీ 13వ తేదీన చనిపోయిందని తెలిపారు. జూన్ 4వ తేదీన సీఎం జగన్ దిమ్మదిరిగే ఫలితాలు రావడం ఖాయం అని ధీమా వ్యక్తం చేశారు. ఫలితాలు చూసి వైసీపీకి ఆ రోజు పెద్ద కర్మ నిర్వహించాల్సి ఉంటుందని సెటైర్లు వేశారు. జగన్‌కు రిటర్న్ గిఫ్ట్ ఉంటుంది.. ఆ విషయం తర్వాత చెబుతామని మీడియా ప్రతినిధులకు రఘురామ వివరించారు.

నరకం చూపించారు..

గత ప్రభుత్వ హయాంలో తనకు నరకం చూపించారని రఘురామ వివరించారు. పుట్టి పెరిగిన ఊరు వచ్చేందుకు నాలుగేళ్ల సమయం పట్టిందని పేర్కొన్నారు. చివరికీ హైదరాబాద్‌లో అరెస్ట్ చేయించారని.. జగన్‌లో ఓ ఉన్మాది ఉన్నారని విమర్శించారు. ఉన్మాదికి అధికారం దక్కడంతో కొందరిని టార్గెట్ చేశారని రఘురామ వెల్లడించారు. తాను ఒక్కోడినే కాదు చాలామందిని జగన్ వేధించారు.. చివరికి అశోక గజపతిరాజు లాంటి సౌమ్యుడిని కూడా వదల్లేదని గుర్తుచేశారు.

కూటమి విజయం పక్కా

ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల్లో కూటమి విజయంపై రఘురామ ధీమాతో ఉన్నారు. తెలుగుదేశం పార్టీ, జనసేన, భారతీయ జనతా పార్టీలకు 120 నుంచి 125 సీట్ల వరకు వస్తాయని వివరించారు. కూటమి నేతృత్వంలో ఏర్పడే ప్రభుత్వానికి తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి అవుతారని స్పష్టం చేశారు. ఎన్నికల్లో వైసీపీ గెలుస్తోందని ఆ పార్టీ నేతలు మేకపోతు గాంభీర్యాన్ని ప్రదర్శిస్తున్నారని రఘురామ ధ్వజమెత్తారు. జగన్ రెండోసారి సీఎంగా ప్రమాణ స్వీకారం చేస్తానని ముహూర్తం కూడా ప్రకటించారు. ఆ ముహూర్తానికి వైసీపీ పార్టీ భూస్థాపితం అవుతుందని సెన్సేషన్ కామెంట్స్ చేశారు.

# శ్రీ సంజయ్ మూర్తి, శ్రీ సీతారామ్‌తో కలిసి ఉపాధ్యాయులకు (ఉన్నత విద్య) 2024 జాతీయ అవార్డుల కోసం నామినేషన్ల కోసం పోర్టల్

న్యూఢిల్లీ, 21 :ఉన్నత విద్యామండలి కార్యదర్శి శ్రీ సంజయ్ మూర్తి, ఎఐసిటిఇ చైర్మన్, శ్రీ ౦. ఉ సీతారామ్‌తో కలిసి ఈరోజు ఉపాధ్యాయులకు జాతీయ అవార్డులు (ఉన్నత విద్య) 2024 నామినేషన్ల కోసం పోర్టల్‌ను ప్రారంభించారు.

ఉన్నత విద్యా శాఖ, విద్యా మంత్రిత్వ శాఖ కూడా నామినేషన్ల సమర్పణకు మార్గదర్శకాలను విడుదల చేసింది. టెక్నికల్ మరియు నాన్-టెక్నికల్ ఉన్నత విద్యా సంస్థలలోని ఆదర్శవంతమైన ఉపాధ్యాయులు/అధ్యాపకులు మరియు పాలిటెక్నిక్ సంస్థల ఉపాధ్యాయులకు ఈ అవార్డులు అందించబడతాయి. కింది విస్తృత విభాగాల ఆధారంగా మొదటి వర్గం కింద మూడు ఉప-వర్గాలు ఉంటాయి: ఇంజనీరింగ్ & టెక్నాలజీ, ఆర్కిటెక్చర్; మ్యాథమెటిక్స్, ఫిజికల్ సైన్సెస్, బయోలాజికల్ సైన్సెస్, కెమికల్ సైన్సెస్, మెడిసిన్, ఫార్మసీతో సహా ప్యూర్ సైన్సెస్; మరియు ఆర్ట్స్ అండ్ సోషల్ సైన్సెస్, హ్యుమానిటీస్, లాంగ్వేజెస్, లీగల్ స్టడీస్, కామర్స్ మరియు మేనేజ్‌మెంట్.

నామినేషన్ల సమర్పణకు చివరి తేదీ 20 జూన్ 2024. ఎంపికైన అవార్డు గ్రహీతలను సెప్టెంబరు 5 (ఉపాధ్యాయుల దినోత్సవం) నాడు భారత మాజీ రాష్ట్రపతి మరియు ప్రముఖ ఉపాధ్యాయుడు డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి సందర్భంగా సత్కరిస్తారు.

నామినీ రెగ్యులర్ ఉద్యోగాన్ని కలిగి ఉన్న అదే విశ్వవిద్యాలయం/ఇన్‌స్టిట్యూట్/కాలేజ్/పాలిటెక్నిక్ యొక్క మాజీ లేదా ఇప్పటికే ఉన్న వైస్-ఛాన్సలర్/డైరెక్టర్/ప్రిన్సిపాల్/ఫ్యాకల్టీ సభ్యుడు/సహోద్యోగి. ఇంతకు ముందు నామినీ/నామినేషన్ రీ-నామినేషన్ కోసం అర్హులు,

ఉన్నత విద్యా సంస్థల్లో ఉపాధ్యాయులకు జాతీయ అవార్డు 2024 యొక్క ఉద్దేశ్యం దేశంలోని అత్యుత్తమ అధ్యాపకుల విలక్షణమైన సహకారాన్ని గుర్తించడం మరియు వారి అంకితభావం మరియు కృషికి, ముఖ్యంగా బోధన మరియు బోధనలో మరియు దాని ప్రభావం కోసం వారిని గౌరవించడం. ఉన్నత విద్య యొక్క నాణ్యతను మెరుగుపరచడమే కాకుండా వారి విద్యార్థుల జీవితాలను కూడా సుసంపన్నం చేసింది. అధ్యాపకుల బోధన-అభ్యాసం, కమ్యూనిటీ ఔట్రీచ్, సంస్థాగత సేవ, పరిశోధన మరియు ఉన్నత విద్యా రంగంలో కొత్తదనం వంటి అంశాలలో అధ్యాపకుల విశిష్టమైన మరియు మార్గనిర్దేశం చేసే విజయాలను గుర్తించి, గౌరవించ డానికి ఈ అవార్డు ప్రయత్నిస్తుంది.

# సింగపూర్ విమానంలో భారీ కుదుపులు.. ఒకరి మృతి..పలువురికి గాయాలు

న్యూఢిల్లీ, 21 :సింగపూర్ ఎయిర్‌లైన్స్‌కు చెందిన విమానానికి పెను ప్రమాదం తప్పింది. విమానం గగనతలంలో ఉండగా ఆకస్మికంగా భారీ కుదుపులకు గురైంది. ఈ ప్రమాదంలో ఒకరు మృతిచెందగా, 30 మందికి గాయాలయ్యాయి. ఈ విమానంలో ప్రయాణిస్తున్న ప్రయాణికుడు మరణించాడని.. పలువురు గాయపడినట్లు ఎయిర్‌లైన్ తెలిపింది. బోయింగ్ 777-300ఇఖీ విమానం 211 మంది ప్రయాణికులు, 18 మంది సిబ్బందితో లండన్ నుంచి సింగపూర్‌కు బయలుదేరింది. గగనతలంలో ఉండగా భారీ కుదుపులకు లోనైంది. దీంతో బ్యాంకాక్‌లో పైలట్ ఎమర్జెన్సీ ల్యాండింగ్ చేసినట్లు విమానయాన సంస్థ ఒక ప్రకటనలో తెలిపింది. ఒకరు చనిపోయినట్లుగా.. 30 మంది గాయపడినట్లుగా సింగపూర్ ఎయిర్‌లైన్స్ ధృవీకరించింది.

మృతుడి కుటుంబానికి ఎయిర్‌లైన్స్ సంతాపం తెలిపింది. క్షతగాత్రలకు వైద్యం అందిస్తున్నట్లు చెప్పింది. ప్రయాణికులకు, సిబ్బందికి సాయం అందించడమే తమ ప్రాధాన్యత అని తెలిపింది. అవసరమైన వైద్య సదుపాయాలు అందిచేందుకు థాయ్‌లాండ్‌లోని స్థానిక అధికారులతో కలిసి పని చేస్తున్నట్లు చెప్పింది. అలాగే బ్యాంకాక్‌కు ఒక బృందాన్ని పంపుతున్నట్లు ఎయిర్‌లైన్స్ వెల్లడించింది. విమానంలో కుదుపులు రావడానికి కారణాలు తెలుసుకునేందుకు సాంకేతిక సిబ్బందిని అక్కడికి పంపుతున్నట్లు తెలిపింది.

# సంగారెడ్డిలో మామిడి రకాల ప్రదర్శన.

## -ముఖ్య అతిథిగా వైస్ ఛాన్సలర్ డాక్టర్ బి నీరజా ప్రభాకర్ హాజరు.



సంగారెడ్డి మే 21 (నేటి నిజం ప్రతినిధి) కొండా లక్ష్మణ్ తెలంగాణ రాష్ట్ర ఉద్యాన విశ్వవిద్యాలయం ఫల పరిశోధన స్థానం మామిడి రకాల ప్రదర్శన నిర్వహించారు. సోమవారం నాడు సంగారెడ్డి లోని ఫల పరిశోధన కేంద్రంలో నిర్వహించిన మామిడి రకాల ప్రదర్శన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వైస్ ఛాన్సలర్ డాక్టర్ బి నీరజా ప్రభాకర్ హాజరై మామిడి రకాల ప్రదర్శన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా నీరజా ప్రభాకర్ మాట్లాడుతూ నైజాం పరిపాలన 1918 కి ముందు ఈ ప్రదేశం గుర్రాల శాలగా ఉండేది. 1958 లో మామిడి రకాలను నాటడం జరిగింది అని అన్నారు . దేశంలో లక్నోలో గల ఫల పరిశోధన స్థానం మొదటి స్థానంలో ఉండగా సంగారెడ్డి లో గల ఫల పరిశోధన కేంద్రం రెండవ స్థానంలో ఉందన్నారు. 500 రకాల పండ్ల మొక్కల తయారీ పెంపకం ఉన్నాయని అన్నారు. 1971లో ఈ ఫల పరిశోధన కేంద్రంలో నర్సరీ స్థాపించడం జరిగిందని చెప్పారు. మామిడి రకాల మొక్కలను మహారాష్ట్ర, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు ఈ మొక్కలు ఎగుమతి జరుగుతుందని చెప్పారు. మంజీరా రకం, మల్లికా రకం, బాలానగర్ అనే రకం, బంగనపల్లి రకం, దచేరి రకం, వికారాబాద్ మ మేద రకాలు రైతులకు బాగా దిగుబడినిస్తున్నాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ బి సుచరిత, డాక్టర్ ఏ కిరణ్ కుమార్, డాక్టర్ హరికాంత్, డాక్టర్ బి మాధవి, డాక్టర్ పి హరికాంత్, డాక్టర్ మౌనిక డాక్టర్ నితీష్ తదితరులు పాల్గొన్నారు.

# హాస్పటల్ కు వస్తే మృత్యువు కాటేసింది.. విరిగిపడిన చెట్టు.. స్పాట్‌లో భర్త కన్నుమూత ..

హైదరాబాద్, 21 :హైదరబాద్ లోని బొల్లారం కంటోన్మెంట్ ఆసుపత్రిలో ప్రమాదం చోటుచేసుకుంది. కంటోన్మెంట్ ఆసుపత్రిలో చికిత్స నిమిత్తం వచ్చిన దంపతులపై ఆస్పత్రి ఆవరణలో ఉన్న భారీ వృక్షం విరిగి పడడంతో భర్త రవీందర్ అక్కడికక్కడే మృతి చెందగా అతని భార్య సరళ దేవికి తీవ్ర గాయాలయ్యాయి. ఆసుపత్రికి వస్తున్న క్రమంలో ఈ ఘటన చోటు చేసుకుంది. ఈ ఘటనలో సరళ దేవికి సైతం తీవ్ర గాయాలు కావడంతో హుటాహుటిగా మెరుగైన చికిత్స కోసం అంబులెన్స్ లో గాంధీ ఆస్పత్రికి తరలించారు. సరళ దేవి ఉపాధ్యాయురాలుగా పనిచేస్తున్నట్లు గుర్తించారు.

ఘటనా స్థలికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం గాంధీ ఆసుపత్రికి తరలించారు. ఒక్కసారితో ఈ ఘటన మూలంగా ఆసుపత్రికి వచ్చిన వారంతా ఆందోళన గురయ్యారు. ఆసుపత్రి లోపలికి సరళ దంపతులకంటే ముందే ఒక బైక్ అక్కడి నుంచి వెళ్లింది.. అయితే వీరు తరువాత అటు నుంచే ప్రయాణించారు. వీరిపై విధి వక్రీకరించింది. ఒక్కసారిగా భారీ వృక్షం వీరిద్దరపై పడటంతో సరళ భర్త అక్కడికక్కడే మృతి చెందారు. సరళకు తీవ్ర గాయాలతో స్పృహ కోల్పోయింది. స్థానిక సమాచారంతో ఘటనాస్థలికి చేరుకున్న పోలీసులు సరళను హుటాహుటిన గాంధీ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# ఇండియా కూటమి గెలిస్తే రైతులు, పేదలు, గ్రామీణుల రుణాల మాఫీ : అఖిలేష్ యాదవ్

న్యూఢిల్లీ, 21 :లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో కాషాయ పార్టీ లక్ష్యంగా సమాజ్‌వాదీ పార్టీ చీఫ్ అఖిలేష్ యాదవ్ విమర్శలు గుప్పించారు. గత పదేండ్ల బీజేపీ హయాంలో పారిశ్రామికవేత్తల రుణాలు రూ. 25 లక్షల కోట్లు మాఫీ చేశారని ఆరోపించారు. యూపీలోని అజాంఘఢ్‌లో సోమవారం జరిగిన ఎన్నికల ప్రచార ర్యాలీని ఉద్దేశించి ఆయన మాట్లాడారు.

జూన్ 4 తర్వాత బీజేపీ బడా పారిశ్రామికవేత్తల రుణాలను మాఫీ చేస్తుందని, అయితే విపక్ష ఇండియా కూటమి అధికారంలోకి వస్తే పారిశ్రామికవేత్తల రుణాలు కాకుండా పేదలు, రైతులు, గ్రామాల్లో నివసిస్తున్న సామాన్యుల రుణాలను మాఫీ చేస్తామని అఖిలేష్ యాదవ్ హామీ ఇచ్చారు.

కాషాయ పాలనలో బడా పారిశ్రామికవేత్తలు, సంపన్నులకే మేలు జరిగిందని అన్నారు. ప్రధాని మోదీ తనకు సన్నిహితులైన పారిశ్రామిక దిగ్గజాలకు దేశ సంపదను దోచిపెటారని విమర్శించారు. యూపీలో కాంగ్రెస్, ఎస్పీ కూటమికి ప్రజల నుంచి విశేష ఆదరణ లభిస్తోందని అన్నారు.

# సాయుధ దళాలలో ఉమ్మడి సంస్కృతిని అభివృద్ధి చేస్తున్న జాయింట్‌నెస్ 2.0, ముందుకు వెళ్లే మార్గం అని అఊా జనరల్ అనిల్ చౌహాన్

న్యూఢిల్లీ, 21 :చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్ జనరల్ అనిల్ చౌహాన్ మూడు సేవలను జాయింట్ ఆపరేషనల్ స్ట్రక్చర్‌లను రూపొందించే దిశగా కదులుతున్నప్పుడు ఉమ్మడి సంస్కృతిని సృష్టించాలని పిలుపునిచ్చారు. న్యూఢిల్లీలోని USI ఆఫ్ ఇండియాలో ఏర్పాటు చేసిన 22వ మేజర్ జనరల్ సమీర్ సిన్హా మెమోరియల్ లెక్చర్‌లో భాగంగా 'జాయింట్‌మెన్‌షిప్: ది వే ఎహెడ్'పై మాట్లాడుతూ, CDS సాయుధ దళాలలో ఉమ్మడి సంస్కృతిని అభివృద్ధి చేయడం జాయింట్‌నెస్ 2.0గా పేర్కొంది, ఇది ముందుకు సాగే మార్గం.

చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్ మాట్లాడుతూ, జాయింట్‌నెస్ 1.0 అనేది సేవల మధ్య మెరుగైన బంధం మరియు ఏకాభిప్రాయానికి సంబంధించినది, మరియు పెద్ద తేడాలు లేనందున, జాయింట్‌నెస్ 2.0 అనే తదుపరి స్థాయి జాయింట్‌నెస్ వైపు వెళ్లడానికి ప్రేరణ ఉంది.

మూడు సేవల యొక్క విభిన్న సంస్కృతిని గుర్తించి, సేవల్లో నాల్గవ సంస్కృతిని సృష్టించాల్సిన అవసరం ఉందని CDS నొక్కి చెప్పింది. "ఉమ్మడి సంస్కృతి సేవా నిర్దిష్ట సంస్కృతికి భిన్నంగా ఉన్నప్పటికీ, ప్రతి సేవ యొక్క ప్రత్యేకతను గౌరవించాలి. మేము ప్రతి సేవలో ఉత్తమమైన వాటిని స్వేదనం చేయగలగాలి మరియు తక్కువ సాధారణ హారం కోసం స్థిరపడకుండా అత్యధిక సాధారణ కారకాన్ని చేర్చగలగాలి, "అని చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్ అన్నారు. జాతీయ కార్యక్రమాలలో ట్రై-సర్వీసెస్ భాగస్వామ్యంతో సహా ఉమ్మడి సంస్కృతిని పెంపొందించడానికి ప్రాసెస్ చేయబడుతున్న సింబాలజీ యొక్క వివిధ కార్యక్రమాలను ఆయన ప్రస్తావించారు.

CDS జాయింట్‌నెస్ & ఇంటిగ్రేషన్ని ఫంక్షనల్ ఇంటిగ్రేటెడ్ థియేటర్ కమాండ్‌ల సృష్టికి ముందస్తు అవసరాలుగా పేర్కొంది మరియు అటువంటి ఆదేశాల యొక్క ప్రాముఖ్యతను వివరించింది. "అటువంటి కమాండ్‌ల సృష్టి 'ఆపరేషనల్' ఫంక్షన్‌లను రైజ్-ట్రైన్-సస్టెయిన్ మరియు ఇతర అడ్మినిస్ట్రేటివ్ ఫంక్షన్‌ల నుండి వేరు చేస్తుంది మరియు భద్రతా విషయాలపై కార్యాచరణ కమాండర్ యొక్క ఎక్కువ దృష్టిని అనుమతిస్తుంది," అని అతను చెప్పాడు.

థియేటర్ కమాండ్స్ అంతిమ స్థితి కాదని, తదుపరి సంస్కరణలకు నాంది కాబోదని అఊా పేర్కొంది. ఇంటిగ్రేటెడ్ థియేటర్ కమాండ్‌లు సింగిల్ టు మల్టీ డొమైన్ కార్యకలాపాలు, స్పేస్ మరియు సైబర్ స్పేస్‌లను సాంప్రదాయ డొమైన్‌లుగా కలపడం, యుద్ధభూమి సమాచారం మరియు విజువలైజేషన్ యొక్క డిజిటలైజేషన్, నెట్ సెంట్రిక్ నుండి డేటా సెంట్రిక్ వంటి అనేక సంస్కరణలకు దారి తీస్తాయని ఆయన అన్నారు.

భారత రక్షణ పర్యావరణ వ్యవస్థలో సంస్కరణలు అవసరమని నొక్కిచెప్పిన అఊా, ప్రపంచవ్యాప్తంగా జాతీయ రాష్ట్రాలు కొత్త సవాళ్లను ఎదుర్కొంటున్నాయని, ప్రపంచ క్రమంలో ప్రస్తుత ప్రవాహాలు దేశాలు తమ భద్రతా వ్యూహాలను సమీక్షించుకునేలా బలవంతం చేస్తున్నాయని పేర్కొంది. సాంకేతిక పరిజ్ఞానం యొక్క వేగవంతమైన మరియు హద్దులు లేని కవాతు భవిష్యత్తులో జరిగే యుద్ధాల మార్గాన్ని మారుస్తోంది, అన్నారాయన.

# భద్రత సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా ఉండాలి

## -స్ట్రాంగ్ రూమ్ లో ఉన్న ఈవీఎంల పై ప్రత్యేక నిఘా ఉంచాలి.
## -స్ట్రాంగ్ రూమ్ ల భద్రత పరిశీలన.
## -జహీరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ ఆర్ఓ, జిల్లా ఎన్నికల అధికారి / కలెక్టర్ క్రాంతి వల్లూరు



సంగారెడ్డి, 21 : (నేటినిజం ప్రతినిధి):ఈవీఎంలను భద్రపరిచిన స్ట్రాంగ్ రూమ్ వద్ద ఉన్న భద్రతా సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా ఉండాలని జహీరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ ఆర్ఓ,జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరి మంగళవారం రుద్రారం గీతం యూనివర్సిటీ కళాశాలలో, స్ట్రాంగ్ రూమ్ లలో భద్రపరిచిన నారాయణఖేడ్ ,అందోల్ ,జహీరాబాద్ ,యెల్లారెడ్డి ,కామారెడ్డి ,బాన్సు వాడ , జుక్కల్ అసెంబ్లీ సెగ్మెంట్ లకు సంబంధించిన ఈవీఎంలను స్ట్రాంగ్ రూమ్ ల వద్ద పోలీస్ భద్రతను, సీసీ కెమెరాల పనితీరును, కంట్రోల్ రూమ్ రికార్డులను, పోలీస్ సిబ్బంది విధుల నిర్వహణను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ స్ట్రాంగ్ రూమ్ ల వద్ద భద్రత కట్టుదిట్టంగా ఉండాలని, నిరంతరం అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో నిమ్జ్ ప్రత్యేకాధికారి రవీంధర్ రెడ్డి , సెర్వేయర్ కోటేశ్వరావు, ఎఆర్ఓ, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


తెలంగాణ సారస్వత పరిషత్తు
తిలక్ రోడ్, అబిడ్స్, హైదరాబాద్

ఆహ్వానం



మాతృమూర్తి శ్రీమతి కోడూరు శాంతమ్మ స్మారక
బాల సాహిత్య సమ్మేళనం
2024 మే 29, 30 తేదీల్లో

వేదిక : డా. దేవులపల్లి రామానుజరావు కళామందిరం
తెలంగాణ సారస్వత పరిషత్తు ప్రాంగణం
తిలక్‌రోడ్, అబిడ్స్, హైదరాబాద్

మొదటి సదస్సు
మధ్యాహ్నం 2 గంటలకు
'బడిలో తెలుగు భాష' చర్చా గోష్ఠి
విశిష్ట అతిథి
డా. దాసరి వెంకట రమణ
కేంద్ర సాహిత్య అకాడమీ బాల సాహిత్య పురస్కార గ్రహీత
అధ్యక్షులు
డా. వి.ఆర్. శర్మ ప్రముఖ బాలసాహితీవేత్త
పాల్గొనే ప్రముఖులు
శ్రీ బద్రి కూర్మారావు, డా. చిట్యాల దేవేంద్రప్ప, శ్రీ పుల్లా రామాంజనేయులు, డా. శారదా హన్మాండ్లు, డా. తూర్పింటి నరేష్ కుమార్, శ్రీమతి బాలబోయిన రమాదేవి, శ్రీ కూకట్ల తిరుపతి, శ్రీ గోపగాని రవీందర్, శ్రీమతి త్రిపురారి పద్మ, శ్రీమతి జి. శ్రీమతి, శ్రీ శీలం భద్రయ్య, శ్రీ గుళ్ళపల్లి తిరుమల కాంతికృష్ణ, శ్రీ సయ్యద్ షఫీ, శ్రీ చక్రవర్తుల శ్రీనివాస్, శ్రీ అక్షరం ప్రభాకర్, శ్రీ అరుణ బట్టువార్, శ్రీ కొండూరు పోతన
సమన్వయ కర్త : డా. ఉప్పల పద్మ అధ్యాపకులు,రాష్ట్ర విద్యా పరిశోధనా మండలి

సాయంత్రం 4 గంటలకు
రెండవ సదస్సు
"పత్రికలు – బాలసాహిత్యం' చర్చా గోష్ఠి
అధ్యక్షులు : శ్రీ బైస దేవదాసు 'నేటి నిజం' సంపాదకులు
విశిష్ట అతిథి : శ్రీ మణికొండ వేదకుమార్ 'బాల చెలిమి' సంపాదకులు
పాల్గొనే బాలల పత్రిక సంపాదకులు, పత్రికా రచయితలు
శ్రీ టి. వేదాంత సూరి (మొలక), శ్రీ యన్.కె. బాబు (నాని), శ్రీ రాజా (చెకుముకి), శ్రీ ప్రభాకర్ (చంపక్), డా. బి. మనోహరి (మూసి), శ్రీ పొత్తూరి సుబ్బారావు (సాహితీ కిరణం), డా. నెమిలేటి కిట్టన్న (బాలల నేస్తం), శ్రీమతి రత్నమాధవి (గడుగ్గాయి), శ్రీ కంతేటి చంద్రప్రతాప్
సమన్వయకర్త : శ్రీ కోమటి రెడ్డి బుచ్చిరెడ్డి ప్రముఖ బాలసాహితీవేత్త

సాయంత్రం 6 గంటలకు
మూడవ సదస్సు
'కథ చెప్పే కళ'
అధ్యక్షులు
శ్రీ చొక్కాపు వెంకటరమణ
కేంద్ర సాహిత్య అకాడమీ బాల సాహిత్య పురస్కార గ్రహీత
విశిష్ట అతిథి
శ్రీమతి కన్నెగంటి అనసూయ
కేంద్ర సాహిత్య అకాడమీ బాల సాహిత్య పురస్కార గ్రహీత
పాల్గొనే కథకులు
డా. ఎం. హరికిషన్, శ్రీ ఎన్నవెల్లి రాజమౌళి, శ్రీ వంగపల్లి పద్మ, శ్రీమతి మనోజ, శ్రీమతి దివ్య, శ్రీమతి ఎ. ప్రమీల, శ్రీమతి సమ్మెట ఉమాదేవి, శ్రీ టి.వి.ఎస్. సుబ్రహ్మణ్యం, శ్రీమతి కృష్ణ చైతన్య
సమన్వయ కర్త :శ్రీమతి రమాదేవి కులకర్ణి ప్రముఖ కవయిత్రి

30వ తేది ఉదయం 10గంటలకు
నాల్గవ సదస్సు
"లలిత కళా పరిచయం"
అధ్యక్షులు : శాంతా రావు బాల వికాసకారులు
విశిష్ట అతిథి : డా. జి. అమృతలత విద్యావేత్త, ప్రముఖ రచయిత్రి
ప్రసంగాంశాలు – వక్తలు
సంగీతం - శ్రీమతి మాడభూషిణి రాజ్యలక్ష్మి సంగీత విద్వాంసురాలు
నృత్యం - కోకా విజయలక్ష్మి ప్రముఖ నర్తకి, నాట్యగురువు
నాటకం - శ్రీ బీచరాజు శ్రీధర్ ప్రముఖ రంగస్థల నటులు, దర్శకులు
చిత్రలేఖన శిల్పకళ - శ్రీ జె. వెంకటేశ్వర్లు (జెవి) ప్రముఖ చిత్రకారులు, జెఎన్టీయూ అధ్యాపకులు
జానపద కళలు - శ్రీ గజవెల్లి ఈశ్వర్ తెలంగాణ సారస్వత పరిషత్తు ప్రాచ్యకళాశాల అధ్యాపకులు
సమన్వయకర్త : శ్రీ కోకిల నాగరాజు అధ్యాపకులు, కళాకారులు

మధ్యాహ్నం 12 గంటలకు
ఐదవ సదస్సు
"బాల సాహిత్యం – ప్రమాణాలు"
అధ్యక్షులు : శ్రీమతి ముంజులూరి కృష్ణకుమారి ప్రముఖ బాలసాహితీవేత్త
విశిష్ట అతిథి: శ్రీమతి మాడభూషి లలితా దేవి కన్వీనర్, మాడభూషి రంగాచార్య స్మారకట్రస్టు
పాల్గొనే బాలసాహితీవేత్తలు
శ్రీ టి.వి. రామకృష్ణ, డా. గంగిశెట్టి శివకుమార్, డా. కందేపి రాణీ ప్రసాద్, డా. సిరి, డా. సాగర్ల సత్తయ్య, శ్రీ ఉంద్రాళ్ళ రాజేశం, శ్రీ పుప్పాల కృష్ణమూర్తి, డా. బి.వి.ఎన్. స్వామి, శ్రీ పైడిమర్రి రామకృష్ణ, శ్రీ మాచిరాజు కామేశ్వరరావు, శ్రీ ఆర్.సి. కృష్ణస్వామి, శ్రీ కొత్తపల్లి సురేశ్
సమన్వయకర్త : డా. అమరవాది నీరజ బాల సాహితీవేత్త
భోజన విరామం

ఆరో సదస్సు
మధ్యాహ్నం 2.30 గంటలకు
"బాల సాహిత్యం – గ్రంథాలయాలు"
అధ్యక్షులు : శ్రీ సి.ఎ. ప్రసాద్ బాల సాహితీవేత్త
విశిష్ట అతిథి : శ్రీ శీల అవిలేను స్వచ్ఛంద గ్రంథాలయ నిర్వాహకులు
పాల్గొనే బాల సాహితీవేత్తలు, గ్రంథాలయ నిర్వాహకులు
డా. వాసరవేణి పర్శరాములు, శ్రీ డి. ప్రవీణ్ శర్మ, శ్రీ కందుకూరి భాస్కర్, శ్రీ రాచర్ల రమేష్, శ్రీ ఎస్. వెంకటనారాయణ, శ్రీమతి సబ్బని సుమిత్రాదేవి, శ్రీ కిలపర్తి దాలినాయుడు, శ్రీ కూచిమంచి నాగేంద్ర, శ్రీ పోరెడ్డి అశోక్, శ్రీ మెండు మహేశ్వర్, శ్రీమతి గద్వాల కిరణ్ కుమారి, శ్రీ దుర్గం బైతి
సమన్వయం : డా. కాసర్ల నరేష్ రావు బాల సాహితీవేత్త, రచయిత

సాయంత్రం 4.30 గంటలకు
సమాపనోత్సవం
అధ్యక్షులు
ఆచార్య ఎల్లూరి శివారెడ్డి
అధ్యక్షులు, తెలంగాణ సారస్వత పరిషత్తు
ముఖ్య అతిథి
శ్రీమతి ఎం. రాధారెడ్డి
డైరెక్టర్, తెలంగాణ రాష్ట్ర విద్యా పరిశోధన మండలి (ఎస్.సి.ఈ.ఆర్.టి.)
విశిష్ట అతిథి
శ్రీమతి పాలడుగు సరోజినీ దేవి
సంయుక్త సంచాలకులు, మోడల్ స్కూల్స్, తెలంగాణ ప్రభుత్వం
గౌరవ అతిథి
డా. పత్తిపాక మోహన్
దక్షిణప్రాంత అధికారి, నేషనల్ బుక్ ట్రస్ట్, భారత ప్రభుత్వం

ఈ కార్యక్రమానికి సాదరంగా ఆహ్వానిస్తున్నాం.

డా. జె. చెన్నయ్య
ప్రధాన కార్యదర్శి, తెలంగాణ సారస్వత పరిషత్తు

# రైతుల సమస్యల పరిష్కారం కోసం బిజెపి కరీంనగర్ అసెంబ్లీ నేతల నిరసన దీక్ష...



కరీంనగర్, 21 : (నేటినిజం ప్రతినిధి) అకాల వర్షాలతో నష్టపోయిన రైతాంగాన్ని ఆదుకోవాలని, రైతులు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలు పరిష్కరించాలని, కాంగ్రెస్ ప్రభుత్వం రైతాంగానికి ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చాలని డిమాండ్ నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ కరీంనగర్ బిజెపి అసెంబ్లీ ఆధ్వర్యంలో బిజెపి రణభేరి పేరిట మంగళవారం జిల్లా కార్యాలయంలో నిరసన దీక్ష కార్యక్రమం చేపట్టింది. ఇట్టి కార్యక్రమంలో పాల్గొన్న కరీంనగర్ బిజెపి అసెంబ్లీ ముఖ్య నేతలు మాట్లాడుతూ రాష్ట్రంలో రైతు వ్యతిరేక ప్రభుత్వం రాజ్యమేలుతుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నాలుగు నెలల కాలం గడిచిన రైతులకు ఇచ్చిన హామీలను నెరవేర్చడం లేదని మండిపడ్డారు. ఇటీవల అకాల వర్షాలతో వంట నష్టపోయిన రైతాంగాన్ని ఆదుకునే ప్రయత్నం చేయడం లేదని, రైతుల పట్ల కాంగ్రెస్ ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధి ఏంటో దీన్ని బట్టి అర్థమవుతుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వానికి రైతుల పట్ల చిత్తశుద్ధి ఉంటే వెంటనేఅకాల వర్షాలతో పంట నష్టపోయిన రైతులందరికీ నష్టపరిహారం చెల్లించాలని బిజెపి కరీంనగర్ అసెంబ్లీ పక్షాన డిమాండ్ చేస్తున్నామన్నారు.× తడిచిన పంట ఎలాంటి కండిషన్ లో ఉన్న పూర్తి మద్దతు ధరతో కొనుగోలు చేయాలని,కొనుగోళ్ల విషయంలో తాలు , తరుగు, తేమ పేరిట రైతాంగాన్ని ఇబ్బంది పెట్టద్దన్నారు.

ఎన్నికల మేనిఫెస్టోలో కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన విధంగా ఎకరాకు రూ .500 బోనస్ చెల్లించాలని, రెండు లక్షల రుణమాఫీని వెంటనే చేయాలని,రైతు భరోసా కింద రైతులకు, కౌలు రైతులకు రూ.15000, రైతు కూలీలకు రూ .12000 వెంటనే అందించాలని వారు ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. దీక్షా కార్యక్రమం లోకరీం నగర్ అసెంబ్లీ కన్వీనర్ దుబాల శ్రీనివాస్ , బాస సత్యనారాయణ రావు ,వాసాల రమేష్, రాజేంద్ర ప్రసాద్ ,గుంజీటి శివకుమార్ నరహరి లక్ష్మారెడ్డి ,ఎడమ సత్యనారాయణ రెడ్డి , దుర్శెట్టి సంపత్ ,దుర్శేడ్ అనూప్ కుమార్ ,బండర మణారెడ్డి ,కొలిపాక శ్రీనివాస్ ,సుధా కర్ పటేల్ బండారి గాయత్రి ,రాగి సత్యనారాయణ జానపట్ల స్వామి, తిరుమల్ రెడ్డి మాడిశెట్టి సంతోష్ కుమార్ చిట్టిబాబు ,దూడం శ్రీనివాస్, అడిచెర్ల రాజు తదితరులు పాల్గొన్నారు.

# రైతాంగాన్ని ఆదుకోండి.. కాంగ్రెస్ రైతాంగానికి ఇచ్చిన గ్యారెంటీలను, హామీలను అమలు చేయాలి....

## -బిజెపి పార్లమెంట్ కన్వీనర్ బోయినపల్లి ప్రవీణ్ రావు...



రాజన్న సిరిసిల్ల, 21 :(నేటినిజం ప్రతినిధి): అకాల వర్షాల తో పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలని, కాంగ్రెస్ ప్రభుత్వం రైతాంగానికి ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చాలని బిజెపి కరీంనగర్ పార్లమెంటు కన్వీనర్ బోయినపల్లి ప్రవీణ్ రావు డిమాండ్ చేశారు. రైతన్నల పరిష్కారం కోసం బిజెపి రణభేరి పేరిట సిరిసిల్లలో నిరసన దీక్ష కార్యక్రమం చేపట్టింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన పార్లమెంట్ కన్వీనర్ బోయినపల్లి ప్రవీణ్ రావు మాట్లాడుతూ అతి తక్కువ వ్యవధిలో రైతన్నల వ్యతిరేకతను కాంగ్రెస్ ప్రభుత్వం మూటగట్టుకుందన్నారు. రైతులను కన్నీరు పెట్టించిన ఏ ప్రభుత్వం మనుగడ సాధించిన చరిత్ర లేదన్నారు. రైతులు అనేక సమస్యలతో కొట్టుమిట్టాడుతుంటే రేవంత్ రెడ్డి ప్రభుత్వం చోద్యం చూస్తుందన్నారు. వడ్ల కొనుగోలు ప్రక్రియ ఆలస్యం చేస్తుండటంతో కొనుగోలు కేంద్రాల వద్ద రైతులు పంటను కాపాడుకో వడానికి నిద్రాహారాలు మాని పడిగాపులు కాస్తున్న దయనీయ పరిస్థితి ఉందన్నారు. దీనికితోడు అకాల వర్షాల నుంచి పంటను కాపాడేందుకు రైతులు నానా అవస్థలు పడుతున్నారన్నారు. పంటను రక్షించుకోవడానికి సరిపడ టార్పలిన్ కవర్లు అందుబాటులో ఉంచడంలో ప్రభుత్వం విఫలమై ందన్నారు.. తడుస్తున్న ధాన్యాన్ని తిరిగి అరబెట్టేం దుకు రైతులు అనేకకష్టాలు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.. తాలు, తరుగు, తేమతో సంబంధం లేకుండా కనీస మద్దతు ధర చెల్లించి ధాన్యాన్ని కొనుగోలు చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించినప్పటికీ, క్షేత్రస్థాయిలో అమలైన దాఖలాలు లేవన్నారు. ముఖ్యంగా తాలు, తరుగు, తేమ పేరుతో క్వింటాలుకు 5 నుండి 10 కిలోలు కోత పెడుతూ రైతుల కష్టాన్ని దోచుకుంటున్నారని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం కనీస మద్దతు ధర కూడా ఇవ్వకుండా, పంటపై కోతలు కటింగ్లు విధిస్తూ, క్వింటాలుకు రూ.200 నుండి రూ.500 ల వరకు రైతులు నష్టపోయే పరిస్థితి తీసుకు వచ్చిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాకముందు ఓ మాట అధికారంలోకి వచ్చాక ఓ మాట మాట్లాడుతుందని, రైతాంగానికి ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూటకో మాట మాట్లాడుతుందని విమర్శించారు.క్వింటాలుకు రూ.500 ల బోనస్ , రెండు లక్షల రుణమాఫీ, రైతు భరోసా 15000, రైతు కూలీలకు ఇస్తామన్న 12 వేల హామీలు దిక్కు లేకుండా పోయిందన్నారు. ప్రధానంగా అన్ని రకాల పంటలకు బోనస్ అందిస్తామన్న కాంగ్రెస్ సర్కార్ నేడు సన్న వడ్లకే రూ.500 బోనస్ ఇవ్వాలని నిర్ణయం తీసుకున్నామని ప్రకటన చేయడంతో , దొడ్డు రకం వడ్లను పండించిన అత్యధిక శాతం రైతులను ఆందోళనకు గురిచేస్తోందన్నారు. ఈ అంశంలో రైతాంగానికి స్పష్టత ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. ఇప్పటికే వడ్ల కొనుగోలు ప్రక్రియ సగానికిపైగా పూర్తయినందున కొనుగోలు చేసిన వడ్లకు సైతం సకాలంలో డబ్బులు చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు. అలాగే యాసంగిలో అకాల వర్షాలకు పలు ప్రాంతంలో పెద్ద ఎత్తున పంట నష్టం జరిగిందని,. బిజెపి క్షేత్రస్థాయి పర్యటనలో రైతులతో మాట్లాడుతున్నప్పుడు వరి, మొక్కజొన్న, మామిడి పంట లకు తీవ్ర నష్టం వాటిల్లందని,. నష్టపోయిన రైతులకు తక్షణమే రూ.10 వేల నష్టపరిహారం అందిస్తామని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించినప్పటికీ నేటికీ పరిహారం అందనేలేదన్నారు.. ఒక్కో రైతు సగటున ఎకరానికి రూ.20 వేల పెట్టుబడి పెట్టారని,. కౌలు రైతులపై అదనంగా మరో రూ.10 వేల భారం పడిందన్నారు.,పంటల బీమా పథకాన్ని అమలు చేసి రైతన్నకు అండగా ఉండాలని, వారిని ప్రభుత్వం అన్ని విధాల ఆదుకోవాలని బీజేపీ పక్షాన కోరుతున్నామన్నారు. . లేనిపక్షంలో రైతులకు అండగా నిలబడి, వారి పక్షాన పెద్ద ఎత్తున నిరసనా కార్యక్రమాలు చేపడతామని బీజేపీ పక్షాన హెచ్చరిస్తున్నామన్నారు. ఈ దీక్ష కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మట్ట వెంకటేశ్వర్ రెడ్డి, పార్లమెంట్ కో- కన్వీనర్ ఆడెపు రవీందర్, సిరిసిల్ల పట్టణ అధ్యక్షుడు నాగుల శ్రీనివాస్ వీర్నపల్లి మండల అధ్యక్షుడు దేవేందర్ రెడ్డి తంగళ్ళపల్లి మండల అధ్యక్షుడు శ్రీధర్ రావు జిల్లా కార్యదర్శి బుగ్గ రెడ్డి, గజబింకర్ చందు, జిల్లా అధికార ప్రతినిధి భరకం నవీన్ యాదవ్, గుండెల్లి వేణు, పట్టణ ప్రధాన కార్యదర్శి ఎనగంటి నరేష్, కొండ నరేష్, శ్రీనివాసరావు కిసాన్ మోర్చా అధ్యక్షుడు సుంకరి బాలకిషన్, పంపరి అర్జున్, కోడం శ్రీనివాస్, కోడం ఆనంద్ బాబు, బండారి వెంకటేశ్వర్లు, తాటిపాముల సత్యం, కాళీచరణ్, శ్రీనివాస్, వద్నాల సత్యం, మరియు పార్టీ బూత్ అధ్యక్షులు పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు

# ఏపీ అసెంబ్లీ ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ ఓటమి పక్కా : ప్రశాంత్ కిశోర్

అమరావతి, మే 21 : ఏపీ అసెంబ్లీ ఎన్నికలు ముగిశాయి. ప్రజలంతా తమ ఓటును ఈవీఎంలలో నిక్షిప్తం చేశారు. వచ్చే నెల 4న ఫలితాలు వెల్లడికానున్నాయి. ఎన్నికల్లో విజయం తమదేనంటే తమదేనని అధికార వైఎస్సార్ పార్టీ పేర్కొంటున్నారు. 150కిపైగా సీట్లు సాధించి జూన్ 9న రెండోసారి జగన్ సీఎంగా ప్రమాణం చేస్తారని అధికార పార్టీ నేతలు చెబుతున్నారు. మరో వైపు ఎన్నికల్లో ఎన్డీయే కూటమి విజయం ఖాయమని నేతలు స్పష్టం చేస్తున్నారు. అయితే, ఏపీ ఎన్నికల ఫలితాలపై ప్రముఖ వ్యూహకర్త ప్రశాంత్ కిశోర్ కీలక వ్యాఖ్యలు చేశారు.

ఎన్నికల్లో వైఎస్సార్సీపీ ఘోర పరాజయం తప్పదన్నారు. సీఎం జగన్ చెబుతున్నట్లుగానే అమిత్‌షా, రాహుల్ గాంధీ, తేజస్వీ యాదవ్ సైతం చెబుతున్నారన్నారు. తాను గత పదేళ్లుగా ఎన్నికల్లో పని చేస్తున్నానని.. ఫలితాలకు ముందు ఓటమిని అంగీకరించిన వారు ఎవరూ కనిపించలేదన్నారు. ఫలితాల రోజున జగన్‌కు మైండ్ బ్లాక్ అవుతుందన్నారు. జగన్ ఓటమి ఖాయమైందని.. వైఎస్సార్సీపీ చిత్తుగా ఓడిపోబోతుందన్నారు. దేశంలో ఎవరు ఎక్కడ గెలుస్తారు.. ఎవరు ఓడిపోతారనేది అంచనా వేయగలనని.. జగన్ విషయంలోనూ తన అంచనాలు తప్పవన్నారు.

# ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించిన కలెక్టర్



సంగారెడ్డి, 21 : (నేటినిజం ప్రతినిధి):మిల్లుల వద్ద ధాన్యం త్వరగా అన్ లోడ్ చేయించాలని జిల్లా కలెక్టురు క్రాంతి వల్లూరు సివిల్ సప్లై అధికారులను ఆదేశించారు.

మంగళవారం అందోల్ డివిజన్ లోని మన్సాన్ పల్లి,కన్సాన్ పల్లి గ్రామాలల్లో కొనుగోలు కేంద్రాలను కలెక్టర్ పరిశీలించారు.

ఈ సందర్భంగా రైతుల ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు మాట్లాడుతూ వాతావరణ మార్పులకనుగుణంగా ఉదయమే కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలని తెలిపారు . రోజు ఐదు లారీలకు తక్కువ కాకుండా కొనుగోలు కేంద్రాలకు ఏర్పాటు చేయాలని అధికారుల ను ఆదేశించారు.

అకాల వర్షాలు పడుతున్నందున వేగవంతం కొనుగోలు చేసిన ధాన్యాన్ని వెంటనే మిల్లులకు తరలించాలని అధికారులను ఆదేశించారు. చివరిగింజ వరకు ధాన్యం కొనుగోలు చేయాలని సెంటర్ ఇన్చార్జిస్ కి సూచనలు జారీచేశారు.గన్నీబ్యాగ్ల సమస్యలు ఉంటే అధికారుల దృష్టికి తేవాలని తెలిపారు.

మిల్లులకు ఇచ్చిన కెపాసిటీని పూర్తి చేయాలని, రైతుల నుండి కొనుగోళ్లకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా రైతుల శ్రేయస్సు దృష్టిలో వుంచుకొని మిల్లులలో స్పేస్ పెంచుకొని ధాన్యం లారీలను త్వరగా అన్ లోడ్ చేయించాలని, ఆ వెంటనే ఆన్ లైన్ నమోదు చేయాలని ఆదేశించారు.

సమావేశంలో సివిల్ సప్లయ్ జిల్లా మేనేజరు కొండల్ రావు,జిల్లా పౌర సరఫరాల అధికారి వనజాత, మెప్మా పి డి. గీత, ఆర్డీఓ పాండు, సంబంధిత అధికారులు రైతు లు పాల్గొన్నారు.

# అవినీతి, బంధుప్రీతిని ప్రోత్సహిస్తున్న కాంగ్రెస్ : పుష్కర్ సింగ్ ధామి

న్యూఢిల్లీ, 21 : కాంగ్రెస్ పార్టీ తన తీరు మార్చుకోలేదని అవినీతి, బంధుప్రీతిని ఆ పార్టీ ప్రోత్సహి స్తోందని ఉత్తరాఖండ్ సీఎం పుష్కర్ సింగ్ ధామి అన్నారు. హరియాణ లోని పానిపట్‌లో సోమవారం జరిగిన ఎన్నికల ప్రచార ర్యాలీని ఉద్దేశించి ఆయన మాట్లాడారు.ఓవైపు ప్రధాని నరేంద్ర మోదీ దేశాన్ని అభివృద్ధి దిశగా ముందుకు తీసుకువెళుతుంటే కాంగ్రెష్ మాత్రం ఈ ఎన్నికల్లో కూడా అవినీతి, బంధుప్రీతి, బుజ్జగింపు రాజకీ యాలకు పాల్పడుతోందని ఆరోపించారు. మరోవైపు లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో కాషాయ పార్టీ లక్ష్యంగా సమాజ్‌వాదీ పార్టీ చీఫ్ అఖిలేష్ యాదవ్ విమర్శలు గుప్పించారు.గత పదేండ్ల బీజేపీ హయాంలో పారిశ్రామికవేత్తల రుణాలు రూ. 25 లక్షల కోట్లు మాఫీ చేశారని ఆరోపించారు. యూపీలోని అజాంఘఢ్‌లో సోమవారం జరిగిన ఎన్నికల ప్రచార ర్యాలీని ఉద్దేశించి ఆయన మాట్లాడారు.జూన్ 4 తర్వాత బీజేపీ బడా పారిశ్రామికవేత్తల రుణాలను మాఫీ చేస్తుందని, అయితే విపక్ష ఇండియా కూటమి అధికారం లోకి వస్తే పారిశ్రామికవేత్తల రుణాలు కాకుండా పేదలు, రైతులు, గ్రామాల్లో నివసిస్తున్న సామాన్యుల రుణాలను మాఫీ చేస్తామని అఖిలేష్ యాదవ్ హామీ ఇచ్చారు.

# కొచ్చిలో 46వ అంటార్కిటిక్ ట్రీటీ కన్సల్టేటివ్ మీటింగ్‌లో అంటార్కిటిక్ టూరిజంపై మొట్టమొదటిసారిగా కేంద్రీకృతమైన వర్కింగ్ గ్రూప్ చర్చలను సులభతరం



న్యూఢిల్లీ, 21 :46వ అంటార్కిటిక్ ట్రీటీ కన్సల్టేటివ్ మీటింగ్ మరియు కమిటీ ఫర్ ఎన్విరాన్‌మెంటల్ ప్రొటెక్షన్ 26వ సమావేశంలో అంటార్కిటికాలో పర్యాటకాన్ని నియంత్రించడంపై మొట్టమొదటిసారిగా కేంద్రీకృతమైన చర్చలను సులభతరం చేయడంలో భారతదేశం కీలక పాత్ర పోషించనుంది. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి శ్రీ కిరణ్ రిజిజు, ఎర్త్ సైన్సెస్ మంత్రిత్వ శాఖ ఈరోజు హాజరయ్యారు. నేషనల్ సెంటర్ ఫర్ పోలార్ అండ్ ఓషన్ రీసెర్చ్, మినిస్ట్రీ ఆఫ్ ఎర్త్ సైన్సెస్ కింద గోవా, మరియు అంటార్కిటిక్ ట్రీటీ సెక్రటేరియట్ మే 20 నుండి మే 30, 2024 వరకు కేరళలోని కొచ్చిలో ఈ సమావేశాలను నిర్వహిస్తాయి. ఈ సమావేశంలో దాదాపు 40 మంది నుండి 350 మంది పాల్గొంటున్నారు. దేశాలు.

యఅఓ మరియు అఖ 1959లో సంతకం చేసిన 56 కాంట్రాక్టింగ్ పార్టీల యొక్క బహుపాక్షిక ఒప్పందం అంటార్కిటిక్ ఒప్పందం యొక్క నిబంధనలకు అనుగుణంగా నిర్వహించబడే ఉన్నత-స్థాయి ప్రపంచ వార్షిక సమావేశాలు. అంటార్కిటికా యొక్క విధానం, పాలన, నిర్వహణ, సంరక్షణ మరియు రక్షణ. అఖ 1991లో అంటార్కిటిక్ ఒప్పందానికి (మాడ్రిడ్ ప్రోటోకాల్) పర్యావరణ పరిరక్షణపై ప్రోటోకాల్ క్రింద స్థాపించబడింది. అంటార్కిటికాలో పర్యావరణ పరిరక్షణ మరియు పరిరక్షణపై CEP ATCMకి సలహా ఇస్తుంది.

1983 నుండి అంటార్కిటిక్ ఒప్పందానికి భారతదేశం ఒక కన్సల్టేటివ్ పార్టీగా ఉంది. ఇతర 28 కన్సల్టేటివ్ పార్టీలతో, అంటార్కిటికా యొక్క శాస్త్రీయ అన్వేషణ మరియు పర్యావరణ పరిరక్షణలో భారతదేశం కీలక పాత్రను కలిగి ఉంది. పరిపాలన, శాస్త్రీయ పరిశోధన, పర్యావరణ పరిరక్షణ మరియు లాజిస్టికల్ సహకారం వంటి విషయాలలో ATCM సమయంలో తీసుకున్న నిర్ణయాలు మరియు తీర్మానాలను ప్రతిపాదించడానికి మరియు ఓటు వేయడానికి దీనికి హక్కు ఉంది. ఇంకా, ఇది పరిశోధనా కేంద్రాలను స్థాపించగలదు, శాస్త్రీయ కార్యక్రమాలు మరియు లాజిస్టిక్ కార్యకలాపాలను నిర్వహించగలదు, పర్యావరణ నిబంధనలను అమలు చేయగలదు మరియు అంటార్కిటిక్ ట్రీటీ సభ్యులు పంచుకున్న శాస్త్రీయ డేటా మరియు పరిశోధన ఫలితాలను యాక్సెస్ చేయవచ్చు. కాంట్రాక్టు మరియు కన్సల్టేటివ్ పార్టీలు అంటార్కిటిక్ ఒడంబడిక, పర్యావరణ సారథ్యం, శాస్త్రీయ పరిశోధనలను ప్రోత్సహించడం మరియు సైనిక కార్యకలాపాలు మరియు ప్రాదేశిక క్లెయిమ్‌లు లేకుండా అంటార్కిటికాను శాంతి జోన్‌గా నిర్వహించడం బాధ్యత వహిస్తాయి. ATCM అర్జెంటీనాలో ప్రధాన కార్యాలయం ఉన్న అంటార్కిటిక్ ట్రీటీ సెక్రటేరియట్ ద్వారా నిర్వహించబడుతుంది.

MoESకార్యదర్శి మరియు భారత ప్రతినిధి బృందం అధిపతి డాక్టర్. ఓ. రవిచంద్రన్ సెషన్‌లో ప్రసంగిస్తూ, "అంటార్కిటికా అరణ్యం మరియు శాస్త్రీయ ఆవిష్కరణ యొక్క చివరి సరిహద్దులలో ఒకటి. ఈ అసాధారణ ప్రాంతం యొక్క నిర్వాహకులుగా, భవిష్యత్ తరాలకు దాని పర్యావరణ సమగ్రతను కాపాడే విధంగా పరిశోధన మరియు పర్యాటకంతో సహా అన్ని కార్యకలాపాలు నిర్వహించబడేలా చూసుకోవడం మా సమిష్టి బాధ్యత. 46వ ATCMలో ఈ కీలకమైన చొరవకు నాయకత్వం వహించినందుకు భారతదేశం గౌరవించబడింది, ఇది అంటార్కిటిక్ ఒప్పంద వ్యవస్థ యొక్క విస్తృత ఫ్రేమ్‌వర్క్‌లో చేర్చడానికి చర్య తీసుకోదగిన సిఫార్సుల శ్రేణిని తీసుకురావాలని భావిస్తున్నారు." అంటార్కిటిక్ ఒప్పంద వ్యవస్థలో నిబద్ధత కలిగిన సభ్యుడిగా ఉన్న భారతదేశం, గుర్తిస్తుంది. అంటార్కిటికాలో పెరుగుతున్న పర్యాటక కార్యకలాపాలు మరియు ఖండంలోని పెళుసుగా ఉండే పర్యావరణంపై వాటి సంభావ్య ప్రభావాన్ని పరిష్కరించాల్సిన అవసరం ఎంతైనా ఉంది, గత కొన్ని సంవత్సరాలుగా అంటార్కిటికాను సందర్శించే పర్యాటకుల సంఖ్య గణనీయంగా పెరుగుతోంది, ఇది చాలా కీలకమైనదిగా మారింది. ఈ విశిష్టమైన మరియు సహజమైన ప్రాంతం యొక్క స్థిరమైన మరియు బాధ్యతాయుతమైన అన్వేషణను నిర్ధారించడానికి నిబంధనలు రూపొందించబడ్డాయి, 1966 నుండి పర్యాటకాన్ని నియంత్రించే చర్చలు కొనసాగుతున్నాయి , కానీ ఇవి ఎజెండా అంశాలు, సెషన్‌లు, పేపర్‌లు లేదా తీర్మానాలు. అంటార్కిటికాలో పర్యాటకాన్ని నియంత్రించడానికి అంకితమైన వర్కింగ్ గ్రూప్ భారతదేశం హోస్ట్ చేసిన 46వ ATCMలో మొదటిసారిగా రూపొందించబడింది.

# సాంస్కృతిక వారసత్వాన్ని ఉపయోగించుకునే సామర్థ్యం కూడా ఉంది: రక్ష రాజ్య మంత్రి శ్రీ అజయ్ భట్

న్యూఢిల్లీ, 21 :'ప్రాజెక్ట్ ఉద్భవ్'లో భాగంగా, మే 21, 2024న న్యూఢిల్లీలోని నేషనల్ మ్యూజియంలో 'భారతీయ వ్యూహాత్మక సంస్కృతి యొక్క చారిత్రక నమూనాలు' అనే అంశంపై సెమినార్-కమ్-ఎగ్జిబిషన్ జరిగింది. ఈ కార్యక్రమానికి రక్ష రాజ్య మంత్రి శ్రీ అజయ్ భట్ చీఫ్‌గా హాజరయ్యారు. అతిథి. ఈ కార్యక్రమంలో 'భారతీయ సైనిక వ్యవస్థల పరిణామం, యుద్ధపోరాటం మరియు వ్యూహాత్మక ఆలోచనలు, ప్రాచీన కాలం నుండి స్వాతంత్ర్యం వరకు' అనే అంశంపై ప్రదర్శన, అలాగే 'ఉద్భవ్ కాంపెండియం' మరియు 'అల్హా ఉదల్ - బల్లాడ్ రెండిషన్ ఆఫ్ వెస్టర్న్ ఉత్తరప్రదేశ్' పుస్తకాన్ని విడుదల చేశారు. .

తన ప్రసంగంలో, రక్ష రాజ్య మంత్రి తన వ్యూహాత్మక సంస్కృతిలో అమూల్యమైన అంతర్దృష్టులను వెలికితీసేందుకు దేశంలోని పురాతన గ్రంథాలు మరియు మౌఖిక సంప్రదాయాలను అన్వేషించడం లక్ష్యంగా పెట్టుకున్న 'ప్రాజెక్ట్ ఉద్భవ్' చొరవ కోసం భారత సైన్యం మరియు యునైటెడ్ సర్వీస్ ఇన్స్టిట్యూషన్ ఆఫ్ ఇండియా ని ప్రశంసించారు. "భౌగోళిక రాజకీయ ప్రకృతి దృశ్యం నిరంతరం అభివృద్ధి చెందుతోంది మరియు మా సాయుధ దళాలు వారి విధానంలో అనుకూలత మరియు వినూత్నంగా ఉండటం అత్యవసరం. మన ప్రాచీన గ్రంథాలు మరియు సంప్రదాయాలను పరిశోధించడం ద్వారా, ఉద్భవ్ వంటి ప్రాజెక్టులు వ్యూహాత్మక సంస్కృతిపై మన అవగాహనను సుసంపన్నం చేయడమే కాకుండా, సాంప్రదాయేతర యుద్ధ వ్యూహాలు, దౌత్య పద్ధతులు మరియు యుద్ధంలో నైతిక పరిగణనలపై విలువైన అంతర్దృష్టులను అందిస్తాయి, "అని ఆయన అన్నారు.






# రాజకీయ లబ్ధి కోసమే అబ్బాస్ సమీపై ఆరోపణలు

## -దళిత యువకుడిపై దాడి ఘటనలో అబ్బాస్ సమీ ప్రమేయం లేదు
## --ఎంఐఎంలో దళితులకు ఉన్న స్వేచ్ఛ ఏరాజకీయ పార్టీలో కనిపించదు
## -ఎంఐఎం పార్టీ, హుస్సేనీపుర, ఖాన్ పుర దళిత నాయకులు

కరీంనగర్, 21 : (నేటినిజం ప్రతినిధి) రాజకీయ లబ్ధి కోసం, హిందూ ముస్లింల మధ్య వైషమ్యాలను మరింత జటిలం చేసేందుకు కొందరు విహెచ్ పి, బజరంగ్ దళ్ నాయకులు, ఉనికిని చాటుకునేందుకు మరికొందరు దళిత సంఘాల నాయకులు, ఎంఐఎం పార్టీ నేత మాజీ డిప్యూటీ మేయర్ అబ్బాస్ సమీపై అవాస్తవాలు ప్రచారం చేస్తూ, సత్యదూరమైన, అర్ధరహితమైన చౌకబారు విమర్శలు చేశారని, ఎంఐఎం పార్టీ కి చెందిన దళిత నాయకులు బెజ్జంకి సుధాకర్, కల్లేపల్లి బాలరాజు, అన్నెమల్ల సురేష్ తో పాటు ఖాన్ పుర, హుస్సేనీ పుర దళిత నాయకులు ఆరోపించారు. మంగళవారం ఎంఐఎం పార్టీ కార్యాలయం దారుస్సలామ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో గత రెండు రోజుల నుంచి మాజీ డిప్యూటీ మేయర్, ఎంఐఎం నేత అబ్బాస్ సమీపై వస్తున్న ఆరోపణలను తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. దళిత యువకుడిపై దాడి అంశంలో అబ్బాస్ సమీ ప్రమేయం లేదని తోసిపుచ్చారు. వివాదాన్ని ప్రశాంతమైన వాతావరణంలో ఇరు వర్గాల మధ్య సయోధ్య కుదరచడానికి ప్రయత్నం చేస్తే బురద జల్లుతారా అని ప్రశ్నించారు. దాడి జరిగిన అంశంపై బాధిత దళిత యువకుడిని పునర్ విచారణ జరిపించి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అబ్బాస్ సమీ ఇంటిలో ఎలాంటి దాడి జరగలేదని, వివాదా లను పరిష్కరించే సెక్యులర్ నాయకుడు అబ్బాస్ సమీ తప్ప వివాదాలను ప్రోత్సహించే నాయకుడు కాదన్నారు. ఏదైనా సమస్య వస్తే ఇరువర్గాలను కూర్చోబెట్టి కుల పెద్దమనిషిగా ఇద్దరినీ కౌన్సిలింగ్ చేసి బాధ్యతగా వివాదాన్ని పరిష్కరించే నాయకుడు అబ్బాన్ సమీ అని, సమీపై మొదటి సారి ఇన్ని విమర్శలు విని తాము ఆశ్చర్యానికి గురయామన్నారు. గత 25 సంవత్సరాలుగా ప్రజా జీవితంలో ఉన్నటువంటి అబ్బాస్ సమీ, హుస్సే నీపుర, ఖాన్ పురాలో వందలాది దళిత కుటుంబాలు నివాసం ఉంటున్నాయని, తమ కుటుంబాల్లో ఏవైనా సమస్యలు వచ్చినప్పుడు స్థానిక ప్రజాప్రతినిధిగా మా కుటుంబాల్లో ఒక పెద్ద మనిషిగా వచ్చి సమస్యలను పరిష్కరించి ఇరువర్గాలకు న్యాయం చేసే హిందూ ముస్లిం ఫీలింగ్ లేని సామాజిక స్పృహ కలిగిన నాయకుడు అబ్బాస్ సమీ అని చెప్పారు. గత కొన్ని సంవత్సరాలుగా హుస్సేనీపుర ఖాన్పురాలో పాలలో పంచదార మాదిరిగా కలిసిపోయే దళిత ముస్లింలమని, ఇక్కడ గడచిన 30 సంవత్సరాలలో అబ్బాస్ సమీ ప్రజాప్రతినిధిగా ఉన్నారని, ఎక్కడ కూడా దళిత ముస్లింల మధ్య విభేదాలు రాలేదని, ఒకవేళ ఉంటే తాము ఎందుకు ఆయనకు ఓట్లేసి ఆదరిస్తామని చెప్పారు. ఎంఐఎం పార్టీలో దళితులకు ఉన్న స్వేచ్ఛ ఏ ఇతర రాజకీయ పార్టీలో కనిపించదని స్పష్టం చేశారు. ఎంఐఎం పార్టీకి చెందిన ఏ కార్పొరేటర్ కార్యాలయంలోనైనా, కరీంనగర్ దారుసలాంలోనైనా, హైదరాబాద్ దారుస్సలామ్ లోనైనా, డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ ఫోటో ఉంటుందని, దళితుల పట్ల ఎంఐఎం పార్టీలో ఏ మేరకు గౌరవం ఉందో గురు ఎరగాలని, దళిత సంఘాల నాయకులకు విజ్ఞప్తి చేశారు. నాడు దివంగత సుల్తాన్ సలావుద్దీన్ ఓవైసీ




జనరల్ స్థానంలో హైదరాబాద్ మేయర్ పీఠంపై ఆలంపల్లి పోచయ్య అనే దళితుడిని కూర్చోబెట్టిన చరిత్ర దేశంలో కేవలం ఎంఐఎం పార్టీకే దక్కుతుందన్నారు. పార్లమెంట్ వేదికగా బిజెపి ప్రభుత్వంలో దళితులపై దాడులు జరిగినప్పుడు గుంతెత్తి ప్రశ్నించేది ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ కాదా, ఇంతకంటే దళితుల పట్ల చిత్తశుద్ధి ఇంకేం కావాలని ప్రశ్నించారు. దాడికి గురైన బాధిత దళిత యువకుడిని తిరిగి విచారణ జరిపి, అతడి వాంఙ్మూలం ఆధారంగా, దాడి చేసిన దుండగులపై కఠిన చర్యలు తీసుకోవాలని, దాడికి సంబంధంలేని అబ్బాన్ సమీపై కేసును ఎత్తివేయాలని కరీంనగర్ పోలీస్ కమిషనర్ కు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో కందుకూరి రాజు, కందుకూరి నితీష్, రజిని, తిప్పట్ల లహరి, చంద్రయ్య, కే మధు, వెంకన్న, శ్యామ్, గోపి తదితరులు పాల్గొన్నారు.

Printed, Published and owned by VEENADAS, at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana. Published at SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana.
Editor: B. Devadas.
**RNI No.52865/93.** E-mail :netinijam93@gmail.com